



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 18 పేజీలు : 8+8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 30 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 18 PAGES : 8+8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 30 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

### పోలీసులకు సీపీ సజ్జనార్ హెచ్చరిక



- ఫిర్యాదులపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న సజ్జనార్
- డ్రగ్స్, ఆన్‌లైన్ గేమింగ్‌పై ఉక్కుపాదం మోపాలని ఆదేశం
- మహిళలు, బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సిబ్బందికి దిశానిర్దేశం

**హైదరాబాద్ పెన్ పవర్:**విధి నిర్వహణలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని, సస్పెన్షన్ వేటు వేయడానికి కూడా వెనుకాడబోమని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సిబ్బందిని గట్టిగా హెచ్చరించారు. పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటేనే సమాజంలో అసాంఘిక శక్తులు అదుపులో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కమిషనరేట్‌లో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులను పక్కన పెట్టడం లేదా నేర తీవ్రతను తగ్గించి చూపడం వంటివి చేస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. నగరంలో జరిగే కీలకమైన కేసుల దర్యాప్తును పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక 'సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ టీమ్' ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల ఫైళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా డ్రగ్స్, ఆన్‌లైన్ గేమింగ్‌పై ఉక్కుపాదం మోపాలని సూచించారు. సైబర్ క్రైమ్, మహిళల

వివరాలు 2లో..

## బీఆర్ఎస్ దీక్షా దివస్ ఓ నాటకం

- బీఆర్ఎస్ దీక్షా దివస్‌పై మంత్రి సీతక్క విమర్శలు
- బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజే నిర్వహించేవారన్న సీతక్క
- ప్రజలకు పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్
- రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో చెబుతామన్న మంత్రి



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ చేపట్టిన దీక్షా దివస్‌పై తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజే దీక్షా దివస్ నిర్వహించేవారని, అధికారం కోల్పోయిన తర్వాత ఇప్పుడు పది రోజుల పాటు ఆ పేరుతో నాటకాలు ఆడుతున్నారని ఆమె దుయ్యబట్టారు. పదేళ్లలో ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమిటో ఈ దీక్షా దివస్‌లో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంతో చేసిందని అన్నారు.ఈ విజయాలను ప్రజలకు వివరించేందుకు తాము పది రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని, వీటిని అడ్డుకునే కుట్రతోనే బీఆర్ఎస్ దీక్షా దివస్ పేరుతో నాటకాలు ఆడుతోందని ఆమె మండిపడ్డారు. తెలంగాణ వచ్చాక వందల రెట్లు లబ్ధి పొందింది కేసీఆర్ కుటుంబమేనని ఆమె ఆరోపించారు.ఆ పార్టీ దగ్గర ప్రస్తుతం అధికారం మాత్రమే లేదని, కానీ కోట్లాది రూపాయలు ఉన్నాయని ఆమె ఆరోపించారు. అధికారం ఉంటేనే ప్రజల్లో ఉంటామని, లేకపోతే బయటకే రావొద్దని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారని ఆమె విమర్శించారు. దీక్షా దివస్ పేరుతో బీఆర్ఎస్ చేస్తున్న డ్రామాలను తెలంగాణ ప్రజలు విశ్వసించరని ఆమె స్పష్టం చేశారు.




## ఐ-బొమ్మ పూర్తి పేరు ఇంటర్నెట్ బొమ్మ

- ఐ-బొమ్మ, బప్పం పేర్లు ఎందుకు పెట్టాడో చెప్పిన ఐబొమ్మ రవి!
- ముగిసిన ఐ-బొమ్మ రవి రెండో విడత కస్టడీ
- సాంకేతిక సమస్య కారణంగా బలపం పేరునే బప్పంగా పెట్టినట్లు వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** పైరసీ వెబ్‌సైట్లు 'ఐబొమ్మ', 'బ ప్పం'ల పేర్లు ఎందుకు పెట్టారనే విషయాన్ని ఐ-బొమ్మ రవి విచారణలో వెల్లడించాడు. ఐ-బొమ్మ రవిని అరెస్టు చేసిన పోలీసులు మొదట ఐదు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించారు. ఈ కేసులో మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి అతడిని మరోసారి కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరగా, నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం

వివరాలు 2లో..

## వరంగల్ విమానాశ్రయ పనులు వేగవంతం చేయాలి

- హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వందే భారత్ రైల్లో ప్రయాణించిన కేంద్రమంత్రి
- వరంగల్ రైల్వే స్టేషన్‌లో చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించిన కిషన్ రెడ్డి
- భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కిషన్ రెడ్డి
- వరంగల్ విమానాశ్రయ పనులు వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్ నుండి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించి వరంగల్ చేరుకున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం రైల్వే స్టేషన్ క్యాంటీన్‌లో 'చాయ్ పే' చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్ నగరంలోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు.నగరంలో పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన అనంతరం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. వరంగల్ విమానాశ్రయ పనులను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ఇక్కడి నుండి తొలుత ఏటీఆర్ విమానాలు నడపాలని భావిస్తున్నామని, తర్వాత స్పందనను బట్టి మరిన్ని సర్వీసులు నడుపుతామని అన్నారు.

కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని కేంద్ర మంత్రి అన్నారు. అమృత్ పథకం కింద వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. కాజీపేట రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పామని అన్నారు. హృదయ్ పథకం కింద పురాతన ఆలయాల పునరద్ధరణకు కేంద్రం నిధులు ఇచ్చిందని, ఇందులో భాగంగా రామప్ప ఆలయ అభివృద్ధి కోసం కేంద్రం రూ.146 కోట్లు ఖర్చు చేస్తోందని ఆయన అన్నారు.



## 2047 నాటికి లక్షా 39 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ 3 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. త్రీ ట్రిలియన్ ఎకానమీ కావాలంటే 2047 నాటికి తెలంగాణకు లక్షా 39 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుందని తెలిపారు. శనివారం (నవంబర్ 29) ప్రజాభవన్ విద్యుత్ పై సమీక్ష నిర్వహించిన భట్టి.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్

వివరాలు 2లో..

## 70 ఏళ్లు వచ్చినా ముఖ్యమంత్రివి కాలేవు



- పవన్ కల్యాణ్ 'తెలంగాణ' వ్యాఖ్యలు.. ప్యాకేజీ స్టార్ అంటూ తెలంగాణ ఎమ్మెల్యే తీవ్రవ్యాఖ్యలు
- తెలంగాణ నాయకుల దిష్టి వల్లే గోదావరి జిల్లాల్లో కొబ్బరిచెట్లు ఎండిపోతున్నాయన్న పవన్ కల్యాణ్
- దమ్ముంటే టీడీపీని వదిలి ఒంటరిగా పోటీ చేయాలని సవాల్
- పవన్ కల్యాణ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్

వివరాలు 2లో..

## తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు.. ముగిసిన మొదటి విడత నామినేషన్లు



- సాయంత్రంతో ముగిసిన మొదటి విడత నామినేషన్ల గడువు
- మొదటి విడతలో 4,236 గ్రామ పంచాయతీలు, 37,440 వార్డుల్లో నామినేషన్ల స్వీకరణ
- వచ్చే నెల 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల మొదటి దశకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ గడువు సాయంత్రంతో ముగిసింది. మొదటి విడతలో 4,236 గ్రామ పంచాయతీలకు, 37,440 వార్డులకు నామినేషన్లు స్వీకరించారు. ఆదివారం నామినేషన్ల పరిశీలన ఉంటుందని,

వివరాలు 2లో..

## బ్రేక్ ఫాస్ట్ భేటీలో ఏం చర్చించలేదు: సిద్ధరామయ్య, ఇంకొంతకాలం వేచి చూస్తా: డీకే శివకుమార్

- బ్రేక్ ఫాస్ట్ భేటీలో పాల్గొన్న సిద్ధరామయ్య, డీ.కే. శివకుమార్
- తమ మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవన్న సిద్ధరామయ్య
- అధిష్ఠానం వేచి చూడమన్నది.. ఇంకొంతకాలం వేచి చూస్తానన్న డీకే శివకుమార్



**హైదరాబాద్ పెన్ పవర్:**అధిష్ఠానం సూచనల మేరకు డీకే శివకుమార్, తాను బ్రేక్‌ఫాస్ట్ భేటీలో పాల్గొన్నామని, కానీ ఏ విషయంపై చర్చించలేదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. ఇరువురు నేతలు కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ తమ మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, ఇకముందు కూడా ఉండబోవని స్పష్టం చేశారు. కేసీ వేణుగోపాల్ సూచనల మేరకు బ్రేక్‌ఫాస్ట్ భేటీలో పాల్గొన్నామని అన్నారు.

వివరాలు 2లో..

## రామగుండం-మణుగూరు రైల్వే లైన్‌కు గ్రీన్ సిగ్నల్..

**హైదరాబాద్ పెన్ పవర్:**దాదాపు పదేళ్లకుగా పెండింగ్‌లో ఉన్న రామగుండం – మణుగూరు కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర రైల్వే శాఖ నుండి ఇన్-ప్రిన్సిపల్ అప్రూవల్ (సూత్రప్రాయ ఆమోదం) లభించింది. ఎంపీ గడ్డం వంశీకృష్ణ పోరాట ఫలితంగానే రైల్వే సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు పెద్దపల్లి ప్రజలు. ఈ సందర్భంగా ఎంపీ వంశీ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మక రామగుండం – మణుగూరు కొత్త రైల్వే లైన్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (DPR) ఇప్పటికే సిద్ధమైందని, సుమారు రూ4 వేల కోట్ల వ్యయంతో ఈ కొత్త రైల్వే

వివరాలు 2లో..



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన శుభలేఖ సుధాకర్

- ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానం
- రవీంద్ర భారతి ఆవరణలో విగ్రహావిష్కరణ
- విగ్రహ ఏర్పాటుకు అనుమతించినందుకు కృతజ్ఞతలు తెలిపిన సుధాకర్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ సినీ నటుడు శుభలేఖ సుధాకర్ మర్యాదపూ ర్వకంగా కలిశారు. డిసెంబర్ 15న రవీంద్ర భారతి ఆవరణలో దివంగత ఎస్పీ బాలసుబ్ర హ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాల్సిందిగా ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# అమరావతికి రెండో దశ భూసేకరణ అభివృద్ధి వేగం కోసం కీలక అడుగు

ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతి నిర్మాణం పట్ల మరలా చైతన్యం కనిపిస్తోంది. రాజధానిని ప్రపంచస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రెండో దశ భారీ భూసేకరణకు సిద్ధమైంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల స్పష్టంచేసినట్లుగా, భవిష్యత్తు పెట్టుబడులు, అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్స్‌సిటీ, రైల్వేస్టేషన్ వంటి మౌలిక సదుపాయాల నిర్మాణానికి విస్తృత భూములు తప్పనిసరి అవుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కీలకంగా నిలిచింది. రాజధాని ప్రాంతం పరిధిలోని ఏడు గ్రామాల్లో 16,666 ఎకరాల భూసేకరణకు సీఆర్డీఏకి అనుమతి ఇస్తూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ భూములతో కలిపి రెండో దశలో మొత్తం 20 వేల ఎకరాల భూమిని సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా అమరావతి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సమగ్రంగా సిద్ధం చేసేందుకు ప్రభుత్వం ముందడుగు వేసినట్లు స్పష్టమవుతోంది. ఏ ఏ ప్రాంతాల్లో భూసేకరణ కేబినెట్ సమావేశంలో భూసేకరణ చేపట్టే గ్రామాలను సవివరంగా పరిశీలించినట్లు సమాచారం. వైకుంఠపురం, పెదమద్దూరు, కర్లపూడి, హరిశ్చంద్రపురం, వడ్డమాను, పెదపరిమి, ఎంద్రాయి గ్రామాల్లో భూ లభ్యత, యాజమాన్య రికార్డులు, అభ్యంతరాల స్థితి వంటి అంశాలపై అధికారులు సమర్పించిన నివేదికలను సమగ్రంగా పరిశీలించినట్లు తెలుస్తోంది. గ్రామాల వారీగా ప్రభుత్వం సేకరించాలనుకుంటున్న భూములు ఇలా ఉన్నాయి:

**వైకుంఠపురం - 3,361 ఎకరాలు**
**పేదమద్దూరు - 1,145 ఎకరాలు**
**కర్లపూడి - 2,944 ఎకరాలు**
**హరిశ్చంద్రపురం -2,418 ఎకరాలు**
**వడ్డమాను -1,913 ఎకరాలు**
**పెదపరిమి - 6,513 ఎకరాలు**
**ఎంద్రాయి - 2,166 ఎకరాలు**

రైతుల వద్ద ఉన్న భూములు, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల కలయికతో మొత్తం 20,494 ఎకరాలు రెండో విడతలో సేకరించే అవకాశం ఉందని తెలుస్తోంది. త్వరలోనే రెండో విడత ల్యాండ్‌పూలింగ్ నోటిఫికేషన్ వెలువడనుంది. 70,000 ఎకరాల రాజధానిభవిష్యత్తు రూపురేఖలు గతంలో మొదటి విడతలో ల్యాండ్‌పూలింగ్ ద్వారా రైతుల నుంచి ఇప్పటికే 34,000 ఎకరాలు సమీకరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రెండో దశ సేకరణతో పాటు, అదనంగా 16,000 ఎకరాల ప్రభుత్వ భూమిని సీఆర్డీఏకి అప్పగించే అవకాశం ఉంది. ఈ విధంగా, అమరావతి ప్రాజెక్టుకు మొత్తం 70,000 ఎకరాల విస్తీర్ణం సిద్ధమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇది దేశంలోనే అతిపెద్ద ప్రణాళికాబద్ధ రాజధాని నిర్మాణ ప్రాజెక్టులలో ఒకటిగా నిలవనుంది. రైతుల పాత్రప్రగతి దిశలో కీలకం అమరావతి రైతులతో జరిగిన తాజా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన సందేశం ఇచ్చారు. రాజధాని నిర్మాణానికి రైతుల సహకారం మూల స్తంభమని, ఐక్యతతో ముందుకు రాకపోతే అమరావతి కేవలం మున్సిపాలిటీ స్థాయిలోనే మిగిలిపోతుందని హెచ్చరించారు. చిన్న విషయాలకైనా సోషల్ మీడియాలో వివాదాలు సృష్టించడం అభివృద్ధి సాధనను అడ్డుకుంటుందని అభిప్రాయపడ్డారు. జేఏసీల మధ్య ఐకమత్యం లోపిస్తే, అభివృద్ధి లక్ష్యాలు దెబ్బతింటాయని గుర్తు చేశారు. అందువల్ల అన్ని రైతులు ఒకే వేదికపై నిలబడి అమరావతి అభివృద్ధి కమిటీగా పనిచేయాలని సూచించారు.

**అభివృద్ధిలో కొత్త అధ్యాయం ప్రారంభమా?**

రెండో దశ భూసేకరణ నిర్ణయం అమరావతి నిర్మాణానికి వేగం అందించే అవకాశం ఉంది. దీని ద్వారా అంతర్జాతీయ ప్రమాణాల మౌలిక సదుపాయాల నిర్మాణానికి అవసరమైన విస్తృత స్థలం ప్రభుత్వం చేతుల్లోకి రావచ్చు. ఒకవైపు పెట్టుబడిదారులను ఆకర్షించే మార్గం సుగమమవుతుండగా, మరోవైపు రాజధాని రూపకల్పన స్పష్టతతో ముందుకు సాగే అవకాశం ఏర్పడింది. అమరావతి అభివృద్ధి సంవత్సరాలుగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ, తాజా చర్యలు పునరుత్తేజం నింపుతున్నాయి. ప్రభుత్వ సంకల్పం, రైతుల సహకారం, ప్రజల మద్దతు ఈ మూడు సమన్వయమైతే, అమరావతి నిజంగా అంతర్జాతీయ నగరంగా రూపుదిద్దుకోవడం దూరంలో లేని లక్ష్యంగా మారవచ్చు.

# 2047 నాటికి లక్షా 39 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం

- మొదటి పేజి తరువాయి

ద్వారా విద్యుత్ లెక్కలు వెల్లడించారు. రాష్ట్రంలో ఇంధనం డిమాండ్ పై సమీక్ష నిర్వహించిన భట్టీ.. తెలంగాణను ప్రపంచ స్థాయి నగరాలతో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. విద్యుత అవసరాలు తీర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. తెలంగాణ త్రీ ట్రిలియన్ ఎకానమీ కావాలంటే.. అందుకు కవాల్సిన పెట్టుబడులకు విద్యుత్ కావాలని అన్నారు. ఉత్పత్తి రంగాలు అభివృద్ధి చెందితేనే ఎకానమీ ఆశించిన స్థాయిలో ఉంటుందన్నారు. డేటా సెంటర్లతో హైదరాబాద్ గ్లోబల్ హబ్ గా మారబోతోందని.. అందుకు కావాల్సిన విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పవర్ డిమాండ్ పదేళ్లుగా పెరుగుతోందన్న భట్టీ.. 2014 నుంచి 14.2 శాతం గ్రోత్ రేట్ తో పవర్ డిమాండ్ ఉన్నట్లు తెలిపారు. 2021 నుంచి 5.44 గ్రోత్ రేట్ తో ఉన్న డిమాండ్.. 2024 -25 నాటికి 9.4 శాతంగా ఉన్నట్లు తెలిపారు. ఇక2025 నుంచి 2034-, 35 వరకు 6.4 శాతం గ్రోత్ రేట్ ఉంటుందని తెలిపారు. ఓవరాల్ గా 8.50 శాతం ఉండబోతోందన్నారు.

2026 నాటికి24 వేల 766 మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. డేటా సెంటర్లు, మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ, మెట్రో మొదలైన అభివృద్ధి పనులతో.. 2047 నాటికి లక్షా 39 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుందన్నారు. అందులో 50 శాతం గ్రీన్ ఎనర్జీనే వాడాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

# రామగుండం-మణుగూరు రైల్వే లైన్‌కు గ్రీన్ సిగ్నల్..

- మొదటి పేజి తరువాయి

మార్గాన్ని త్వరలో ప్రారంభించేందుకు రైల్వే శాఖ ముందుకు రావడం చారిత్రక పరిణామమని హర్షం వ్యక్తం చేశారు. ఈ రైల్వే లైన్ సింగరేణి కార్మికులకు, సింగరేణి ప్రాంత ప్రజలకు, బొగ్గు రవాణాకు ఎంతో ఉపయోగపడటమే కాకుండా ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద పండగ అయిన సమ్మక్క సారక్క జాతరకు వెళ్ళే వేలాదిమంది ప్రయాణికులకు ఈ రైల్వే లైన్ గొప్ప అవకాశమని తెలిపారు. దీంతో మంథని, మేడారం భక్తులకు ప్రత్యేక కనెక్టివిటీ పెరుగుతుందని చెప్పారు. గత పదేళ్లలో వెనుకబడిన పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంలో భాగంగానే తాను ఈ ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టానని స్పష్టం చేశారు. పెద్దపల్లి%-%మంచిర్యాల ప్రాంతాల్లో రైల్వే లైన్స్, రోడ్లు, %చీఎ%-63 అభివృద్ధి తమ ఇవన్నీ మా ప్రధాన అజెండా తెలిపారు.

# నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

- మొదటి పేజి తరువాయి

భద్రత, వీధి నేరాలు, ఆహార కల్తీ వంటి కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో పలువురు అడిషనల్ సీపీలు, డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# ఐ-బొమ్మ పూర్తి పేరు ఇంటర్నెట్ బొమ్మ

- మొదటి పేజి తరువాయి


అంగీకరించింది. అతడి రెండో విడత కస్టడీ నేటితో ముగిసింది.
పోలీసుల విచారణలో అతడు పలు ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. ఐ-బొమ్మ పూర్తి పేరు ఇంటర్నెట్ బొమ్మ అని తెలిపాడు. విశాఖలో సినిమాను బొమ్మ అని పిలిచేవారని అందుకే ఆ పేరు పెట్టినట్లు చెప్పాడు. మరో పైరసీ వెబ్‌సైట్‌కు బలపం అని పేరు పెట్టాలనుకున్నప్పటికీ, డొమైన్‌లో సాంకేతిక సమస్య కారణంగా 'ఎల్' అక్షరాన్ని తొలగించి 'బప్పం'గా మార్చినట్లు వెల్లడించాడు.ఐ-బొమ్మ రవి రెండో విడత కస్టడీ ఈరోజుతో ముగిసింది.
ఇందులో భాగంగా పోలీసులు అతడిని మూడు రోజుల పాటు ప్రశ్నించి, కీలక విషయాలను రాబట్టారు. పైరసీకి సంబంధించిన అడ్వాన్స్‌డ్ సాంకేతికత గురించి పోలీసులకు రవి వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాలు టెలిగ్రామ్ నుండి తీసుకున్నవేనని చెప్పాడు. కస్టడీ ముగియడంతో పోలీసులు అతడిని కోర్టులో హాజరుపరిచారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన శుభలేఖ సుధాకర్

- మొదటి పేజి తరువాయి

రవీంద్ర భారతి ఆవరణలో విగ్రహ ఏర్పాటుకు అనుమతించినందుకు ఎస్పీ బాలు కుటుంబం తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.గాయకుడు బాలసుబ్రహ్మణ్యం తెలుగు, తమిళ, కన్నడ, హిందీ తదితర భాషల్లో సుమారు 40 వేలకు పైగా పాటలు పాడి శ్రోతల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. అంతేకాకుండా పలు తెలుగు, తమిళ చిత్రాల్లో నటించి మెప్పించారు. సినిమాల్లోనే కాకుండా టీవీ రంగంలో ఆయన పాడుతా తీయగా, పాడాలని ఉంది లాంటి కార్యక్రమాలను నిర్వహించి ఎంతోమంది నూతన గాయనీ, గాయకులను వెలుగులోకి తెచ్చారు. ఆయన 2020 సెప్టెంబర్ 25న కన్నుమూశారు.

# కస్టమర్‌లా జ్యువెలర్స్ దుకాణంలోకి వచ్చి.. మూడు గోల్డ్ చైన్‌లు దొంగిలించాడు!



ఉత్తర ప్రదేశ్‌లోని బదౌన్ జిల్లాలో ఒక వ్యక్తి సూటు, బూటు వేసుకుని వచ్చి బంగారం దుకాణంలో కొనుగోలు పేరుతో బంగారు గొలుసులు దొంగతనం చేశాడు. ఈ ఘటన బదౌన్‌లోని ఒక బంగారం దుకాణంలో చోటుచేసుకుంది. ఖరీదైన దుస్తులతో బంగారం దుకాణంలోకి వచ్చి చోరీ చేసిన ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.నిన్న ఉదయం 11.30 గంటల సమయంలో సదర్ కొత్వాలి ప్రాంతంలోని హల్వాయి చౌక్‌లో ఉన్న జుగల్ కిషోర్ ప్రహ్లాది లాల్ జ్యువెలర్స్ దుకాణంలోకి ఒక వ్యక్తి ప్రవేశించాడు. నలుపురంగు జీన్స్, నలుపు రంగు కోటు, బూట్లు వేసుకున్న అతడు బంగారు గొలుసులు చూపించమని దుకాణంలోని యజమానిని అడిగాడు.యజమాని, సిబ్బంది పలు రకాల డిజైన్ బంగారు గొలుసులను అతడికి చూపించారు. అతను బంగారు గొలుసుల గురించి సిబ్బందిని అడుగుతున్న సమయంలోనే మరికొంతమంది ఆ దుకాణంలోకి వచ్చారు. దుకాణ యజమాని, సిబ్బంది దృష్టి ఇతరుల వైపు ఉండటాన్ని గమనించిన సదరు వ్యక్తి బాక్సులోని మూడు బంగారు గొలుసులను తీసుకుని, పక్కనే కూర్చున్న మహిళను తోసుకుని వేగంగా బయటకు పరుగు పెట్టాడు.అవాక్కైన యజమాని, సిబ్బంది అతనిని పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ దొరకలేదు. యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. జ్యువెలరీ దుకాణంలోని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. బంగారు గొలుసులను దొంగిలించి పారిపోయిన నిందితుడిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

# తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు.. ముగిసిన మొదటి విడత నామినేషన్లు

- మొదటి పేజి తరువాయి

అదే రోజు చెల్లుబాటు అయిన నామినేషన్ల వివరాలు వెల్లడిస్తారని అధికారులు తెలిపారు. సోమవారం అప్పీలు స్వీకరణ, డిసెంబర్ 2న అప్పీళ్ల పరిష్కారం ఉంటుందని పేర్కొన్నారు.డిసెంబర్ 3న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తారు. వచ్చే నెల 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఉపసర్పంచ్ ఎన్నిక జరుగుతాయని అధికారులు తెలిపారు. రేపటి నుండి డిసెంబర్ 2 వరకు రెండవ విడత ఎన్నికల నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండవ విడతలో 193 మండలాల్లోని 4,333 పంచాయతీలకు, 38,350 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.ఇదిలా ఉండగా, వికారాబాద్ తాండూరు మండలంలో సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసే ప్రక్రియ రాత్రి 7 గంటలు దాటినా కొనసాగింది. పదుల సంఖ్యలో అభ్యర్థులు ఉండటంతో రాత్రి 9 గంటల వరకు ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల గడువు ముగిసింది. ఆ సమయానికి క్యూలో ఉన్న అభ్యర్థులకు టోకెన్లు జారీ చేసి నామినేషన్ పత్రాల దాఖలుకు అనుమతిస్తున్నారు.

# 70 ఏళ్లు వచ్చినా ముఖ్యమంత్రివి కాలేవు

తెలంగాణ నాయకుల దిష్టి తగలడం వల్లే గోదావరి జిల్లాల్లో కొబ్బరిచెట్లు ఎండిపోతున్నాయన్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ నేత, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. పవన్ కల్యాణ్‌కు 70 ఏళ్లు వచ్చినా ముఖ్యమంత్రి కాలేరని, ఆయన ఒక ప్యాకేజీ స్టార్ అని విమర్శించారు. తమ దిష్టి తగిలితే పవన్ కల్యాణ్ గెలిచేవారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.దమ్ముంటే తెలుగుదేశం పార్టీని వదిలి ఒంటరిగా పోటీ చేయాలని సవాల్ విసిరారు. తెలంగాణ నాయకుల నరదిష్టి తగిలినందుకే కోనసీమ జిల్లాలో కొబ్బరి చెట్లు మొండెం లేకుండా అయ్యాయని పవన్ కల్యాణ్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. అదే నిజమైతే, ఇతరులు బాగుపడవద్దనే ఉద్దేశం తెలంగాణ వారికి ఉంటే ఆంధ్ర వాళ్లు హైదరాబాద్, తెలంగాణలో వ్యాపారాలు చేసుకునేవారా అని ప్రశ్నించారు. నీటిపారుదల, నిర్మాణం సహా వివిధ రంగాల్లో ఆంధ్ర వాళ్లు ఉన్నారని, తాము ఒక్క మాట కూడా అనడం లేదని అన్నారు.పవన్ కల్యాణ్ ఇష్టానుసారం మాట్లాడితే ఊరుకునేది లేదని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్?కు ఉప ముఖ్యమంత్రి అయ్యేవారా అన్నారు. ఆయన ఉండేది, వ్యాపారం
చేసుకునేది మాత్రం తెలంగాణలోనే అని గుర్తుంచుకోవాలని అన్నారు. తెలంగాణ నాయకులది నరదిష్టి అయితే ఆయన హైదరాబాద్‌లో
ఆస్తులు ఎందుకు కొనుగోలు చేశారని ప్రశ్నించారు.పవన్ కల్యాణ్ తెలంగాణలో ఉన్న ఆస్తులను అమ్ముకుని విజయవాడలో ఉండాలని సవాల్ చేశారు. తాను కూడా పవన్ కల్యాణ్ అభిమానినేనని, అందుకే ఆయన ఓజీ సినిమా ఫ్లాప్ అయినా నిర్మాత నష్టపోకూడదనే ఉద్దేశంతో రూ.800 పెట్టి టిక్కెట్ కొనుగోలు చేశానని అన్నారు. కానీ ఇప్పుడు ఆయన తప్పుగా మాట్లాడారు కాబట్టి అది తప్పని చెబుతున్నానని వ్యాఖ్యానించారు.

# బ్రేక్ ఫాస్ట్ భేటీలో ఏం చర్చించలేదు: సిద్ధరామయ్య, ఇంకొంతకాలం వేచి చూస్తా: డీకే శివకుమార్

- మొదటి పేజి తరువాయి

కానీ ఏ విషయంపై చర్చించలేదని ఆయన వ్యాఖ్యానించారు. నెల రోజుల ముందు నుంచి అందరిలో ఉన్న గందరగోళానికి తెరదించేందుకు ఈ బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిందని ఆయన వెల్లడించారు. బీజేపీ, జేడీఎస్ పార్టీలు తమపై అసత్య ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు.ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తాను, డీకే శివకుమార్ ఉమ్మడిగా ఎదుర్కొంటున్నామని అన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికల పైన ప్రధానంగా దృష్టి సారించిందని అన్నారు. 2028లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని అన్నారు.అనంతరం డీకే శివకుమార్ మాట్లాడుతూ కర్ణాటక ప్రజల మద్దతుతో రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం తాను సిద్ధరామయ్యతో
కలిసి పని చేస్తానని స్పష్టం చేశారు. తాము పార్టీకి విశ్వాసపాత్రులైన సైనికుల్లా పని చేస్తున్నామని అన్నారు. అధిష్ఠానం ఏం చెప్పినా మేమంతా అనుసరిస్తామని పేర్కొన్నారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. నాయకత్వం విషయంలోనూ అధిష్ఠానానిదే తుది నిర్ణయం అన్నారు. పార్టీ పెద్దలు తనను ఇంతకాలం వేచి ఉండమని చెప్పారని, అందుకే వేచి చూశానని, ఇంకొంతకాలం కూడా వేచి ఉండటానికి సిద్ధమేనని స్పష్టం చేశారు.

# సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడం కోసం ఎస్సై ఉద్యోగానికి రాజీనామా

తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ సూర్యాపేట జిల్లాలో ఒక ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఒక ఎస్సై స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఆయన పదవీ కాలం మరో ఐదు నెలలు ఉండగానే ఎన్నికలు రావడంతో, స్వగ్రామంలో పోటీ చేయాలనే ఆకాంక్షతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.
కోదాడలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పులి వెంకటేశ్వర్లు తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. కోదాడ మండలం పరిధిలోని ఆయన స్వగ్రామం గుడిబండలో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆయన నామినేషన్ దాఖలు చేయనున్నారు.రాజకీయ పదవుల కోసం ప్రభుత్వ ఉద్యోగులు తమ అవకాశాలను బట్టి రాజీనామాలు చేయడం సాధారణంగా చూస్తుంటాం. ఎంతోమంది ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు సైతం తమ పదవులకు రాజీనామా చేసి, తమకు నచ్చిన రాజకీయ పార్టీలలో చేరి ప్రజా ప్రతినిధులుగా ఎన్నికవుతున్నారు లేదా నామినేటెడ్ పదవులు పొందుతున్నారు. మరికొందరు ఉద్యోగ విరమణ అనంతరం రాజకీయ రంగ ప్రవేశం చేస్తున్నారు.

## రోడ్డు మార్జిన్ సరిగా లేక నిరంతరం ప్రమాదాలు -పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు. నాయకులు.. గ్రామపంచాయతీ..



సీతారాంపురం పెన్ పవర్‌బినవంబర్ 29:సీతారాంపురం గ్రామపంచాయతీ లోని బస్టాండ్ కూడలి నుండి ఎన్ హెచ్ హైవే రోడ్డు మార్గం వరకు రోడ్డు మార్జిన్లు సరిగా లేక ఇరువైపులా ముళ్ళ చెట్లతో నిండి అటు ఇటు వెళ్లే వాహనాలకు మధ్య నిరంతరం ప్రమాదాలకు కొలువై ఉంది. నిత్యం వాహనాలు తిరిగే ఈ రహదారిపై స్కూలు పిల్లలు కాలేజీ విద్యార్థులు నిరంతరం వెళ్తూ ఉంటారు. ఎన్నోసార్లు ప్రమాదాలు జరిగి చనిపోయిన వారు కూడా ఉన్నారు. అటు ఆర్ అండ్ బి అధికారులు పంచాయితీ సిబ్బంది నాయకులు ఎవరు ఈ మార్గాన్ని పట్టించుకోకుండా చూస్తూ ఉన్నారు. అధికారులు నాయకులు చొరవచూపి ఈ రోడ్డు మార్జిన్ త్వరగా వేయించి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



## క్షేత్ర పర్యటనలతో విజ్ఞానం



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్ 29.:విద్యార్థులు క్షేత్ర పర్యటనలతో వివిధ రకాల ప్రదేశాలు సందర్శిం చడం వలన విజ్ఞానం, వికాసం, వినోదం కలుగుతాయని ప్రధానోపాధ్యాయురాలు పి. వేదవతి అన్నారు. బుచ్చి రెడ్డిపాలెం మున్సిపాలిటీ రామచంద్రాపురం పీఎం శ్రీ పాఠశాల విద్యార్థులతో శనివారం వివిధ రకాల సందర్శన ప్రదేశాలతో విజ్ఞాన యాత్ర నిర్వహించారు. చెము డు గుంట జిల్లా విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి వివిధ రకాల ప్రయోగాలు, రాకెట్ల పనితీరు, విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులు సందర్శించారు. జైన దేవాలయాన్ని సంద ర్శించి దేవాలయ నిర్మాణశైలి, వర్ధమాన మహా వీరుడు,పార్శ్వనాథుడు వంటి జైనుల చరిత్రను విద్యార్థులు తెలుసుకున్నారు. దొడ్ల డైరీకి వెళ్లి పాలు తయారు చేసే విధానం, పాశ్చరైజేషన్ జరిగే ప్రక్రియ, నెయ్యి, వెన్న, పన్నీరు ఎలా వస్తాయో విద్యార్థులు సవివరంగా చూసి తెలుసుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గండికోట సుధీర్ కుమార్,మున్వర్, బ్రహ్మారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ భవాని, శ్రీలేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా చేతి పంపు...

### పంచాయతీ మరియు అధికారుల నిర్లక్ష్యం....



సీతారాంపురం పెన్ పవర్‌బిసెప్టెంబర్ 29
సీతారాంపురం పంచాయతీలోని తురకపాలెం లో ఉన్న ఉర్దూ స్కూల్ నందు గల చేతి పంపు నిరుపయోగంగా ఉంది. గత ఐదు సంవత్సరాలుగా ఈ చేతిపంపు మరమ్మత్తులకు నోచుకోకుండా ఉంది. ఈ విషయమై అడగగా ఎవరు కూడా దీని పట్టించుకోవడంలేదని తెలిపారు. పంచాయతీ వాళ్ళు గానీ అధికారులు గాని ఎవరు కూడా దీని పట్టించుకోకుండా కాలం గడిపేస్తున్నారని వివరించారు. స్కూల్లో పిల్లలు నీళ్లు తాగే దానికి మరి భోజనానంతరం కడుక్కునే దానికి నీళ్లు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. అధికారుల పంచాయతీ నిర్లక్ష్యానికి ఇది ఒక నిదర్శనం. అధికారులు స్పందించి ఈ చేతిపంపు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు

## దిత్వా తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి-ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ...

నాయుడుపేట, పెన్ పవర్, నవంబర్ 29దిత్వా తుఫాన్ ప్రభావం దృష్ట్యా నవంబర్ 29, 30,డిసెంబర్ 1వ తేదీలలో సూళ్లూరుపేట నియోజకవర్గంలో గాలులతో కూడిన భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ ఒక ప్రకటన లో తెలియజేశారు.ప్రతి ఇంటి భద్రత తమ ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అని తెలిపారు.తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# రెడ్ క్రాస్ సభ్యుని నేత్రదానం

కావలి: పెన్ పవర్ -(ఆర్సీ ఇంచార్జ్) నవంబర్ 29:కావలి పట్టణం,వికృతివారి వీధికి చెందిన కావలి రెడ్ క్రాస్ జీవిత సభ్యుడు పసుపులేటి శివ కుమార్ (56) శనివారం తెల్లవారుజామున వారి స్వగృహంలో మరణించారు. వారి సమీప బంధువు పోలు వెంకట గిరి ప్రసాద్ మరియు రెడ్ క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరి రెడ్డి ప్రేరణతో కుటుంబసభ్యులు పసుపులేటి విజయలక్ష్మి ( భార్య) మరియు పి.శ్వేత, పి.శిల్ప (కుమార్తెలు) అంగీకారంతో శివ కుమార్ నేత్రాలను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి దానం



చేశారు. ఆయన కార్నియా లను కార్నియా రికవరీ స్పెషలిస్ట్ సునీల్ సేకరించారు. కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్ నేత్రదాన ప్రశంసాపత్రాన్ని కుటుంబస భ్యులకు అందచేసి కృతజ్ఞతలు తెలిపారు. డిబియస్ ఇంజనీరింగ్ కళాశాల కరెస్పాండంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు, కావలి రెడ్ క్రాస్ జీవితసభ్యులు ఆవుల విజయ్ కుమార్, నరసాపురం రాము తదితరులు నేత్రదాత భౌతికకాయానికి నివాళులు అర్పించారు. కావలి రెడ్ క్రాస్ నేత్రదాన విభాగం కన్వీనర్ ఇలింద్ర శ్రీవాణి మాట్లాడుతూ, ఇది కావలి రెడ్ క్రాస్ మరియు అభయం సంస్థల ఆధ్వర్యంలో జరిగిన 153వ నేత్రదానమని పేర్కొన్నారు. మరణానంతరం నేత్రదానం చెయ్యడానికి రెడ్ క్రాస్ లేదా అభయం సేవ సంస్థ కార్యాలయాలలో సంప్రదించాలని కోరారు.

## ఉచిత కుట్టు శిక్షణా తరగతులను ప్రారంభించిన డి.ఎస్.ఎ

కావలి :పెన్ పవర్ -(ఆర్సీ ఇంచార్జ్ )నవంబర్ 29 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 4 పథకంలో కావలి పట్టణం తుఫాన్ నగర్ ని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో నెల్లూరు పట్టణం నివాసులు సంయుక్త సేవా సంస్థ సభ్యులు కె శ్రీనివాసరావు,కె సాయి చైతన్యల సహాకారంతో కీ శే ఎన్ సి లలిత కుమారుడు కీ శే జై సాయి రాం భావన్‌ల జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా తరగతులను డి ఎస్ పి శ్రీధర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా డి ఎస్ పి శ్రీధర్ మాట్లాడుతూ సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో పేద మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కుట్టు శిక్షణ నేర్చుకోవడం ద్వారా కుటుంబాలు పురోగతి



చెందుతాయని తెలిపారు.ఈ శిక్షణా తరగతులను కొనసాగించేందుకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న కె శ్రీనివాసరావు, కె సాయి చైతన్యలను అభినందించారు. ఈ కార్యక్రమంలో దాతలు కె శ్రీనివాసరావు, కె సాయి చైతన్య, డాక్టర్ సి హెచ్ విజయ భాస్కర రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉపాధ్యాయ క్రీడ పోటీలు.



కావలి :పెన్ పవర్-( ఆర్సీ ఇంచార్జ్) నవంబర్ 29:కావలి పట్టణంలోని జడ్పీ హైస్కూల్ గ్రౌండ్ లో శనివారం ఉపాధ్యాయులకు మండల స్థాయి క్రీడా పోటీలు ఘనంగా జరిగాయి. మండల విద్యాశాఖ అధికారులు బండి గోవిందయ్య ,సిహెచ్ వెంకటసుబ్బయ్య, ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి ఈ పోటీలలో ఉపాధ్యాయులకు మరియు మహిళ ఉపాధ్యాయులకు త్రో బాల్ సెలక్షన్స్ జరిగాయి దీనిలో సెలెక్ట్ అయిన క్రీడాకారులు డివిజన్ స్థాయి లో జరిగే క్రీడా పోటీలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవరావు కోఆర్డినేటర్ పి చిరంజీవి మరియు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మాదక ద్రవ్యాల రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలి




పలమనేరు,పెన్ పవర్, నవంబరు 29.:మాదక ద్రవ్యాల రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని, అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని మదర్ థెరిసా విద్యాసంస్థల కరెస్పాన్డెంట్ రవీంద్ర బాబు పిలుపునిచ్చారు. శనివారం మండలం లోని మదర్ థెరిసా మరియు మాధవి జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలు అనే అంశంపై కళాశాల విద్యార్థులతో గంగవరం మండలకేంద్రం నుండీ పలమనేరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాగా ర్యాలీలో విద్యార్థులు మరియు అధ్యాపకులు పాల్గొని ప్రజలలో చైతన్యం తీసుకురాడానికి ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను అధ్యాపకులను కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు,ఛైర్మెన్ సునీల్,అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు

## తిరుపతి జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటులో ముందడుగు

### తిరుపతి ఎంపీ గురుమూర్తి లేఖతో నవోదయ విద్యాలయ సమితిలో కదలిక.



తిరుపతి /పెన్ పవర్/నవంబర్ 29:తిరుపతి పార్లమెంట్ పరిధిలో జవహర్ నవోదయ విద్యాలయం అవసరం ఉందని గుర్తించిన ఎంపీ మద్దిల గురుమూర్తి ఈ విషయాన్ని తెలియజేస్తూ ఇటీవల జవహర్ నవోదయ విద్యాలయ సమితికి లేఖ రాశారుతిరుపతిలో ఐఐటీ, ఐజర్ వంటి జాతీయ స్థాయి విద్యాసంస్థలు ఉన్నప్పటికీ, గ్రామీణ విద్యార్థులకు స్కూల్ స్థాయిలో నాణ్యమైన విద్యా అవకాశాలు తక్కువగా ఉన్నాయని ఎంపీ ఆ లేఖలో పేర్కొన్నారగ్రామీణ, పేదరికంలో ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో నవోదయ విద్యాలయాలు ఎంతో కీలకమని ఎంపీ అధికారులకి వివరించారుఎంపీ చేసిన విజ్ఞప్తికి స్పందించిన నవోదయ విద్యాలయ సమితి, ప్రతి జిల్లాలో ఒక నవోదయ విద్యాలయం ఉండాలనే పథకం ఉన్నప్పటికీ కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాలో ఇంకా ఈ పాఠశాల లేని విషయం గుర్తించిందినవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం తగిన స్థలాన్ని ఉచితంగా కేటాయించాల్సి ఉంటుందని, శాశ్వత భవనం నిర్మాణం అయ్యేవరకు తాత్కాలిక భవనాన్ని కూడా రాష్ట్రం అందించాల్సి ఉంటుందని నవోదయ విద్యాలయ సమితి స్పష్టం చేసిందితిరుపతి జిల్లాను కూడా నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు పరిశీలన్లో భాగంగా పరిగణించనున్నట్లు కేంద్రం ఎంపీకి ఇచ్చిన లేఖలో పేర్కొంది.ఎంపీ గురుమూర్తి లేఖ అనంతరం సదరు శాఖలో కదలికల ప్రారంభమైంది. తిరుపతి జిల్లాలో నవోదయ విద్యాలయ ఏర్పాటు కోసం అనువైన స్థలం కేటాయించేందుకు పరిశీలన ప్రస్తుతం జరుగుతోంది.త్వరలోనే నవోదయ విద్యాలయం తిరుపతి జిల్లాలో జవహర్ నవోదయ ఏర్పాటు అవుతుందని ఎంపీ గురుమూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు.

# మాక్ అసెంబ్లీకి వెళ్లిన వెంకటాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థి రాజశేఖర్ కు ఘనంగా సన్మానం

**హైదరాబాద్ పెన్ పవర్:** నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ %ల% విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. నంద్యాల జిల్లా, శ్రీశైలం నియోజకవర్గం, ఆత్మకూరు మండల పరిధిలోని, వెంకటాపురం జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థి భాషపోగుల.రాజశేఖర్, మాక్ అసెంబ్లీ ఎన్నికై, డిప్యూటీ స్పీకర్ గా రాణించారు.

ఈ కార్యక్రమం గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జవహర్ నాయక్ ఆధ్వర్యంలో ఆత్మకూరు టౌన్ సిఐ- డి.రాము విద్యార్థి భాషపోగుల.రాజశేఖర్ కు ప్రజాసంఘాల నాయకులతో కలిసి శాలువాలు కప్పి, పూలమాలలు మెడలో వేసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జ్ఞాపికను చేతికి అందించి, ఘనంగా సన్మానం చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఆత్మకూరు అర్బన్ సిఐ-డి. రాము మాట్లాడుతూ ఉన్నతమైన చదువులు చదువుకొని భవిష్యత్తులో ఉన్నతమైన శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. చదువు పేదరికం నిర్మూలన చేస్తుందని అన్నారు. చదువు సమాజంలో మంచి గౌరవాన్ని హోదాను ఇస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్ బాలాజీ నాయక్, మురళి నాయక్, హనుమంతు నాయక్, కృష్ణయ్య, ఈశ్వర్ నాయక్, వి.పుల్లయ్య, బి.వి.రమణ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

# రైతులు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది

-ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్-ఏ.షహబుద్దీన్



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాల మేరకు రైతన్న - మీకోసం కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మండలంలోని, నల్లకాలువ గ్రామంలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆత్మకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వంగాల కృష్ణారెడ్డి, ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్-ఏ.షహబుద్దీన్, మండల వ్యవసాయ అధికారి కె.హేమలత తో కలిసి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ది ఆత్మకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్-ఏ.షహబుద్దీన్ రైతులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాల గురించి వివరిస్తూ, రైతులకు ప్రభుత్వ సబ్సిడీ పంట విత్తనాలను పంపిణీ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రవీంద్ర బాబు, గ్రామ సర్పంచ్ పి.వెంకట రమణ, క్లస్టర్ ఇన్చార్జి దినకర్, పిఏసిఎస్ డైరెక్టర్ రమేశ్, గ్రామ టీడీపీ నేతలు వెంకటేశ్వర రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రహంతుల్లా, మండల పార్టీ ఉపాధ్యక్షులు ప్రసాద్ రావు, ద్రోణా రెడ్డి, సురేశ్ గౌడ్, ఎంపీఈవోలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన వనపర్తి జిల్లా బి ఆర్ ఎస్ యు నాయకులు విద్యార్థులు.




**హైదరాబాద్ పెన్ పవర్:** దీక్షా దివాస్ నవంబర్ 29 సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలో మాజీ వ్యవసాయ శాఖ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాసంలో %దీ=ూఎ% వనపర్తి జిల్లా అధ్యక్షులు హేమంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, విద్యార్థి నాయకులచే కేసీఆర్ గారి చిత్ర పటానికి పాలాభిషేకం చేయడం జరిగింది.ఈ సందర్భంగా %దీ=ూఎ% జిల్లా అధ్యక్షుడు హేమంత్ ముదిరాజ్ మాట్లాడుతూ 16 ఏళ్ల క్రితం కేసీఆర్ మలిదశ ఉద్యమాన్ని ఉధృతం చేసి దీక్ష పూనిన రోజుకు గుర్తుగా ఈ దీక్షా దివాస్ ను ప్రతి ఏటా నవంబర్ 29 తారీకు రోజున నిర్వహించడం జరుగుతుంది అని, అలాగే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తామని తెలిపారుఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి BRSV రాష్ట్ర కార్యదర్శి అవిశెట్టి భాగ్యరాజ్ మాట్లాడుతూ కేసీఆర్ పదహారేళ్ల కిందట ఇదే రోజు దీక్ష పూని, యావత్ తెలంగాణ లోకాన్ని జాగృతం చేసి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ను సాధించారనీ తెలిపారు.వనపర్తి బిఆర్ఎస్ సోషల్ మీడియా సోషల్ మీడియా అధ్యక్షులు మాధవరావుపల్లె సునీల్ వాల్మీకి మాట్లాడుతూ.నవంబర్ 29 దీక్ష దివస్ సందర్భంగా 2009 లో అప్పటి సమైక్య పాలనలో కుట్రలను కుతంత్రాలను తలపెట్టిన వాటిని డీకొట్టి కెసిఆర్ 11రోజుల దీక్ష ఫలితం తెలంగాణ రాష్ట్రం.కావున ఎంతోమంది ఉద్యమకారులు అమరవీరులకు స్ఫూర్తిదయాకం కెసిఆర్ తలపెట్టిన దీక్ష, అలాగే కెసిఆర్ పది ఏండ్ల పాలనలో జరిగిన అభివృద్ధి పనులే మన అందరికి ఆదర్శం అని చెప్పడం జరిగింది.ఈ సందర్భంగా కార్యక్రమంలో విద్యార్థులతో పాటు మంద రాము, చిట్యాల రాము, ప్రేమ్ కుమార్.వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ప్రేమ్ నాథ్ రెడ్డి, కంచె రవి, నాగన్న యాదవ్, చంద్రశేఖర్, రామకృష్ణ, తోట శ్రీను సిరివాటి శంకర్, అలీం ఎండీ, ఎండీ నావాజ్, శివ గౌడ్, కోమరి రాజు, అఖిల్ గౌడ్ మరియు ముఖ్యులు పాల్గొన్నారు

# దశ దిశ మార్చిన దీక్షా దివస్.. తెలంగాణ ఉద్యమం నాటి జ్ఞాపకాలు..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈరోజు ప్రధాన చౌరస్తాలో నవంబర్ 29 దీక్ష దివాస్ కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ నాయకులు వ్యాల్ల హరిష్ రెడ్డి వారి చేతుల మీదుగా తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూలతో ఘన నివాళి అర్పించడం జరిగింది. అనంతరం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. అనంతరం వ్యాల్ల హరిష్ రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ ఉద్యమచరిత వేల పుటల బృహత్ గ్రంథం. ఉద్యమ పథంలో కీలక పరిణామాలు, మరుపురాని సందర్భాలు కోకొల్లలు. కానీ రాష్ట్రసాధన ఉద్యమాన్ని మలుపుతిప్పి, గెలుపు వైపు నడిపించిన అరుదైన ఘట్టం.. దీక్షా దివస్! అది కేసీఆర్ సంకల్ప బలానికి, దీక్షాదక్షతకు సాక్ష్యం! అది అరవై ఏండ్ల పోరాటానికి క్లైమాక్స్ ఎపిసోడ్ ఆ 11 రోజులు.. తెలంగాణ నలుదిశలను ఏకం చేసింది. 'ప్రత్యేక రాష్ట్రం వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో!' 'కేసీఆర్ శవయాత్రో.. తెలంగాణ జైత్రయాత్రో!' అని గర్జించేంత ధైర్యం, తన ఉద్యమంపై నమ్మకం ఏ నాయకుడికి ఉంటుంది? ఒక్క కేసీఆర్‌కు తప్ప. అందుకే రాష్ట్ర సాధన కోసం రణగర్జన చేసి కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష. గల్లీ గల్లీనీ కదలించింది. ఢిల్లీని వణికించింది! 2009 నవంబర్ 29... వలస పాలనపై అంతిమ సమరానికి సన్నద్ధమైన తెలంగాణం..పోరు గడ్డపై నిలబడి తెలంగాణ తరపున కేసీఆర్ చేసిన ఆమ 'రణం'..ఒక్క పిలుపుతో కేసీఆర్ వెంట నడిచిన తెలంగాణ జన సైన్యం..ముక్కోటి తెలంగాణ బిడ్డల ఆకాంక్షలే ఆయన కవచం... పోరు భూమిలో మరణానికి ఎదురు వెళ్లిన కేసీఆర్ మొండి ధైర్యం....అకుంఠిత దీక్షను చూసి ఆసేతుహిమాచలం ఆశ్చర్య పోయిన వైనం....తెలంగాణ ప్రకటన రూపంలో కేసీఆర్ సాధించిన అద్భుత విజయం....తెలంగాణ స్వ రాష్ట్ర పోరాటానికి సగర్వంగా జై




కొడుతూ..కేసీఆర్ అద్భుత పోరాటాన్ని స్మరించుకుంటూ....దీక్షా దివస్‌ను జరుపుకుందాం..అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మాజీ కార్పొరేటర్ ఐత శివ కుమార్,రమణ రెడ్డి,రవి నాయక్, బక్కి కిషన్, మెరుగు చంద్రమొగిలి,జాహిద్ పాషా,కృష్ణ స్వామి, అనుముల కళావతి, పరుశ స్వాతి,రామస్వామి, అల్లి గణేష్, బోట్ల పోషం,బూరుగు వంశీక్రిష్ణ,అత్తరుదిన్, బోట్ల పోషం,ఉదయ్, శ్రీనివాస్ రావు,సిగిరి రాము,నడిపల్లి సాయి,షరీఫ్,తిరుమల్,గొర్రె శంకర్, గొర్రె నర్సింగ్,కొండ సురేష్,అనిల్,పోయిల రవి,శ్యామ్, ప్రవీణ్, యుగేందర్, తదితరులు పాల్గొన్నారు.

# చివరి దశకు నక్సల్స్ ఉద్యమం

**హైదరాబాద్ పెన్ పవర్:**
: అన్నలు.. అలియాస్.. నక్సలైట్లు.. అలియాస్ మావోయిస్టులు.. పేరు ఏదైనా.. పిలిచేది ఎలా అయినా.. వారి పంథా మాత్రం ఒక్కటే. పాలకుల వ్యతిరేక ఉద్యమం.. రాజ్యాంగ వ్యతిరేక ఉద్యమం. దళిత, బహుజన, పీడిత వర్గాల కోసమే పోరాడుతాన్నామంటున్న మావోయిస్టులు.. దళితుడు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తున్నారు. దాదాపు ఐదు దశాబ్దాలు దేశంలో అజ్ఞాతంలో ఉంటూ ప్రభుత్వాలకు సమాంతర పాలన సాగించే ప్రయత్నం చేశారు. అడ్డు చెప్పిన వారిని అంతం చేశారు. పేదల పక్షాన నిలిచినా.. ఇన్‌ఫార్మర్ల పేరుతో పేద గిరిజనులను చంపేశారు. పోలీసులను పొట్టన పెట్టుకున్నారు. మన శత్రు దేశాలతో చేతులు కలిపి ఆయుధాలు పొందుతున్నారు. అయితే ఇప్పుడు పెరిగిన సాంకేతికత మావోయిస్టుడ మనుగడను ప్రశ్నార్థకం చేస్తోంది. రాజ్యాంగేతర శక్తుల ఏరివేతే లక్ష్యంగా కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. 2026 మార్చి నాటికి మావోయిస్టు రహిత దేశంగా ఈ ఆపరేషన్ కొనసాగిస్తోంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా వందల మంది మావోయిస్టులు హతమయ్యారు. వందల మంది భయంతో లొంగుబాట పడుతున్నారు.ఇన్నాళ్లూ ఎర్రజెండాయే మా ఊపిరి అని ఉద్యమం సాగించిన మావోయిస్టులు ఆపరేషన్ కగార్ దెబ్బకు తెల్ల జెండా పట్టుకుని శాంతి మంత్రం జపిస్తున్నారు. తాజాగా మావోయిస్టు కీలక నేత అనంతర్ పేరుతో ఒక ప్రకటన వచ్చింది. 2026 జనవరి 1 నుంచి ఆయుధాలను వదిలించి సాయుధ పోరాటాన్ని పూర్తిగా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ప్రతీ మావోయిస్టు ఒకేసారి లొంగిపోయే ఈ నిర్ణయం, గతంలో మల్లోజుల, ఆశన్న వంటి అగ్రనేతల లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్లతో పార్టీ బలహీనమయ్యింది అనే వాస్తవాలను ప్రతిబింబిస్తోంది.ఒకప్పుడు మావోయిస్టులకు ప్రజలు అండగా నిలిచేవారు. కానీ ఇప్పుడు మద్దతు దాదాపుగా లేదు. ఇక వరుస ఎన్‌కౌంటర్లతో పార్టీ బలహీనపడింది. సిద్ధాంతాలు కనుమరుగయ్యాయి. కేంద్రం కూడా లొంగిపోవాలని పదే పదే పిలుపునిస్తోంది. మావోయిస్టు ఉద్యమ నాయకుల అనుమతితో పునరావాసం, సమాజంలోతో కలసే దిశలోకి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.ఈ నిర్ణయం భారతీయ దేశంలో దీర్ఘకాలంగా కొనసాగిన మావోయిస్టు యుద్ధానికి ఒక మలుపుగా భావించవచ్చు. ప్రాంతీయ రాజకీయాలు, సైనిక చర్యల మధ్య పాదదండనలు, ఆర్థిక, సామాజిక ఒత్తిళ్ల కారణంగా ఈ ఉద్యమం స్వచ్ఛందంగా తేలికపడి ఉండవచ్చు. జనజీవనంలో

మిళితమవుతూ సామాజిక సహకారంతో మావోయిస్టుల అంతరిక్షంలో సమాధి వస్తుందని దీన్ని విశ్లేషకులు భావిస్తున్నారు.మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్ ప్రభుత్వం లొంగిపోయేవారి పునరాలోచనలు, పునరావాసంపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని మావోయిస్టులు సూచించారు. ఇది సుస్థిర శాంతి ఏర్పడటానికి ప్రాధాన్యత కలిగిన అంశం. మొత్తంగా చాలా ఆపరేషన్లు, అగ్రనేతుల వదిలిపోవడం మావోయిస్టు ఉద్యమ నిర్ధారణలో సమాధి మార్గం మొదలవుతున్నట్లు తెలుస్తోంది.

# ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి..

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని అప్పుడే గోవధ ఆగిపోతుంది.. పశుసంపద పెరుగుతుందని రైతు సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ము ప్రేంసాగర్ యాదవ్ అన్నారు. ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలన్న డిమాండ్ తో భారత ప్రధాని నరేంద్ర మోడీ కి లక్ష పోస్టు కార్డులతో లక్ష సంతకాలతో ఉద్యమాన్ని చేపట్టాస్ బోతున్నట్లు ఆయన తెలిపారు. ఈ భూమండలంలో ఆవు పవిత్రమైన మరియు ప్రజలకు ఉపయోగపడే జీవి ఏదైనా ఉందంటే అది ఆవు మాత్రమే అలాంటి ఆవులను ఈరోజు చాలామంది తెలియక గోవధ చేయడం వలన ఎన్నో అనర్ధాలు సంభవిస్తున్నాయి కాబట్టి ఆవులను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నది ఆవులను కాపాడాలని ఉద్దేశ్యముతో ఆవును జాతీయ జంతువుగా వెంటనే ప్రకటించాలని అప్పుడే గోవద ఆగుతుందని భారత ప్రధాని నరేంద్ర మోడీ కి లక్ష మందితో లక్ష పోస్టు కార్డులు మరియు లక్ష మందితో సంతకాలు సేకరించి ఒకే రోజు వారికి అందేలా పంపించటానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ మంచి కార్యక్రమానికి ఇరు రాష్ట్రాల ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేసారు.ఆవులు ప్రతి సంవత్సరం లక్షలాదిగా గోవధకు భలవుటం బాధాకరం కాబట్టి మన గోమాతను కాపాడుకోవలసిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. ఆవులతో బహు ప్రయోజనాలు ప్రజలకు ఉన్నవని ఆవు పకృతిపై ఉంటే ప్రజలు పకృతి బాగుంటది. అందరూ ఆరోగ్యవంతులుగా ఉంటారు



కాబట్టి భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆవును కాపాడుదాం గోమాత బాగుంటే భూమాత కూడా బాగుంటదని, ఈ కార్యక్రమానికి గో ప్రేమికులు ఎవరైనా ఉంటే మాతో సహకరించాలని,అందుకు సలహాలు చూచనలు ఇవ్వాలని ప్రేంసాగర్ యాదవ్ కోరారు. వివరాకలకు మా ఫోన్ నెంబర్. 9291463969. సంప్రదించాలని కోరారు.

# 7000 మంది ఉద్యోగులపై పిడుగు.. రిటైర్మెంట్ బెనిఫిట్లు రాకుండా ఆర్డినెన్స్

**హైదరాబాద్ పెన్ పవర్:**
రాష్ట్రంలోని సుమారు ఏడు వేల మంది ఉద్యోగులకు పిడుగులాంటి వార్త ఇది. తాత్కాలిక ప్రాతిపదికన నియామకమై ఆ తర్వాత వివిధ ప్రభుత్వాల హయాంలో రెగ్యులరైజ్ అయిన వారు, నాన్ మస్టర్‌రోల్ (ఎన్ఎంఆర్)గా చేరినవారు, న్యాయస్థానాల ద్వారా తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయించుకున్నవారికి రిటైర్మెంట్ బెనిఫిట్లను ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం ఆగమేఘాలపై ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్ గవర్నర్ పేరున గెజిట్ కూడా విడుదలైంది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలోని సుమారు ఏడువేల మంది ఉద్యోగులు నికరంగా రూ.20వేల కోట్లు నష్టపోనున్నారు. ఈ గెజిట్ వల్ల రూ.20వేల కోట్లు రాష్ట్ర ఖజానాకు మిగులుతాయని ప్రభుత్వం చెప్తున్నది.రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారం కాకూడదంటే ఈ ఉద్యోగులకు పదవీ విరమణ బెనిఫిట్లు ఏమీ ఉండకూడదంటూ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక, సాధారణ పరిపాలనాశాఖల అధికారులు ఏకంగా ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చారు. ఈ నివేదికను ప్రభుత్వం మంత్రివర్గ సమావేశాల్లో చర్చించి ఆమోదించింది. అందుకు అనుగుణంగా ఆర్డినెన్స్ ఇచ్చింది. ఈ నెల 25న గెజిట్ కూడా జారీ అయింది. గెజిట్ కాపీ, ప్రభుత్వ ఉత్తర్వులను దాచిపెట్టారు. ఇప్పటివరకు ఎక్కడ ఎలాంటి చర్చలు లేకుండా.. ఉద్యోగులకు తెలియకుండానే ఉత్తర్వులు జారీ చేశారు. దీనివల్ల రాష్ట్రంలోని ఏడు వేల మందికిపైగా ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్లను కోల్పోనున్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన మొత్తం రూ.20వేల కోట్లు ఆదా అవుతుందని ప్రభుత్వం క్యాబినెట్‌కు సమర్పించిన నివేదికలోనే పేర్కొన్నది.

**ఎవరా ఉద్యోగులు?**

రాష్ట్రంలో 2/94 యాక్ట్ ప్రకారం వివిధ శాఖల్లో, ముఖ్యంగా నీటిపారుదల, విద్య, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ తదితర శాఖల్లో టైమ్ స్కేల్‌పై పనిచేసినవారిని, ఎన్ఎంఆర్‌గా చేరినవారు, అయిదేండ్లు, పదేండ్లకుపైగా పనిచేసిన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారు. అంతకుముందు కూడా కొంతమంది ఉద్యోగులను క్రమబద్ధీకరించారు. వారు తమను కూడా రెగ్యులర్ ఉద్యోగులుగానే పరిగణించాలని, రెగ్యులర్ ఉద్యోగులకు ఇస్తున్నట్టు ఉద్యోగ విరమణ బెనిఫిట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగ విరమణ బెనిఫిట్లను లెక్కించేందుకు తాము తాత్కాలిక ఉద్యోగిగా ఎప్పుడైతే ఉద్యోగంలో చేరామో.. అప్పటి నుంచే సర్వీసును లెక్కించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.కొన్ని సందర్భాల్లో, కొన్ని శాఖల్లో ప్రభుత్వం వారి డిమాండ్లను అంగీకరించి బెనిఫిట్లను ఇచ్చింది. ప్రభుత్వం ఒప్పుకోని పరిస్థితుల్లో అలాంటి ఉద్యోగులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. న్యాయస్థానాలు కూడా ఉద్యోగుల సర్వీసును లెక్కించే విధానాలపై ఎప్పటికప్పుడు ఉత్తర్వులు ఇచ్చింది. వందలాది మంది ఉద్యోగ విరమణ సమయంలో తమ సర్వీసును తాత్కాలిక ఉద్యోగిగా పనిచేసిన కాలాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని బెనిఫిట్లను ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ప్రభుత్వం వినకపోతే న్యాయస్థానాలను ఆశ్రయించి విజయం సాధించారు. పాత జీతం, డీఏలతోపాటు ఇవ్వాలని కూడా ప్రభుత్వాలను కోర్టులు ఆదేశిస్తున్నాయి.

# అమరావతిలో కృష్ణమ్మకు నిత్య హారతి

**విజయవాడ, నవంబర్ 29, పెన్ పవర్:**
అమరావతిలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనుల మాస్టర్ ప్లాన్‌ను సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఆలయం క్లీన్, గ్రీన్, హైజినిక్‌గా ఉండటంతో పాటు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అన్నప్రసాదం భవనాన్ని విస్తరించాలని చెప్పారు. ఇక కృష్ణమ్మకు నిత్యహారతి ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. కాగా, విస్తరణలో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. 7 అంతస్తుల్లో మహా రాజగోపురంతో పాటు మూడు రాజగోపురాలు నిర్మించనున్నారు. భక్తులు, వీఐపీల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.దేవతల రాజధానిగా సీఎం చంద్రబాబు అభివర్ణించిన అమరావతిలో దేవదేవుడి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబువుతోంది. అమరావతిలోని వెంకటపాలెం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనుల మాస్టర్ ప్లాన్‌ను చంద్రబాబు పరిశీలించారు. ఈ మేరకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయం క్లీన్, గ్రీన్, హైజినిక్ మోడల్ ఉండాలని చెప్పారు. ఆలయ నిర్మాణాల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడాలని.. అమరావతికి వేంకటేశ్వర ఆలయం అదనపు ఆకర్షణ కావాలన్నారు. ప్రస్తుతం వెయ్యి మందికి సరిపోయేలా నిర్మిస్తున్న అన్నప్రసాదం అందించే భవనం.. భవిష్యత్తులో 20 వేల మందికి సరిపోయేలా విస్తరించేలా ప్లాన్ ఉండాలని తెలిపారు. అందుకు అనుగుణంగా పునాది పనులు చేపట్టాలని సూచించారు. ఆలయ చేపట్టిన అన్ని నిర్మాణాల్లోనూ ఇదే విధానంతో ముందుకు వెళ్లాలని తెలిపారు.ఆలయ నిర్మాణ పనులు రెండు దశల్లో చేపట్టే ప్రతిపాదనలు ఏం వద్దని.. ఒకే దశలో అన్ని చేపట్టాలని చంద్రబాబు సూచించారు. తిరుమల శ్రీవారి ఆలయ తరహాలోనే.. వాస్తు పరిమితికి లోబడి నిర్మాణాలు ఉండాలని చెప్పారు. కృష్ణా నదికి అభిముఖంగా రెండెకరాల్లో 50 కాటేజీలు నిర్మించాలని.. నిత్య పూజలు, భజనలు ఉండాలన్నారు. అంతేకాకుండా ఆలయం పక్కనున్న కృష్ణా నదిలో.. గంగా హారతి మాదిరిగా.. సాయంత్రం కృష్ణమ్మ నిత్యం హారతి ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు చెప్పారు.ఆలయ ప్రాంగణంలో ధ్యాన మందిరాన్ని నిర్మిస్తారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తుతో కలిపి దీన్ని నిర్మిస్తారు. ఇందులో ఎగ్జిబిషన్ హాళ్లు ఉండనున్నాయి. ఇక భవిష్యత్తులో మరింత విస్తరించేందుకు వీలుగా డైనింగ్ హాల్, కిచెన్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం.. హెల్ప్ డెస్క్‌లు, కల్యాణ కట్ట, డార్మెటరీలు, లాక్ రూమ్, 3 వెయిటింగ్ హాల్స్ నిర్మిస్తున్నారు.
ఇక అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో వివిధ సేవలకు టికెట్లు అందించేందుకు రిజిస్ట్రేషన్ కౌంటర్లు, సిబ్బందికి గదులు, ప్రథమ చికిత్స గది ఏర్పాటు చేస్తారు. 12 మంది ప్రధాన అర్చకులకు, 12 మంది సిబ్బందికి క్వార్టర్లు నిర్మిస్తారు. అలాగే ఎవరైనా విశిష్ట అతిథులు వస్తే బస, విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా.. ఓ విశ్రాంతి భవనాన్ని నిర్మించనున్నారు. అందులో రెండు వీవీఐపీల సూట్స్, 3 వీఐపీ సూట్స్, డైనింగ్ హాల్, సమావేశ గది, ఏసీ సదుపాయంతో 20 గదులు, వీఐపీ లాబీ, కిచెన్, ప్యాంట్రీ, రిసెప్షన్ వంటి అన్ని సౌకర్యాలు ఉండనున్నాయి.భక్తులకు ప్రసాదాలు అందించడానికి 8 ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా 3 ఎకరాల్లో నిర్మిస్తున్న ప్రకాశ్ ఉద్యానంలో లేజర్ షో ఏర్పాటు చేయనున్నారు. ఆలయ గోడలు, అంతర్గత రహదారులు, ప్రధాన ముఖద్వారం నిర్మించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు.ఆలయం తూర్పు వైపు 110 అడుగుల ఎత్తున, 7 అంతస్తుల్లో మహా రాజగోపురం నిర్మిస్తారు. మిగతా 3 వైపులా 60 అడుగుల ఎత్తుతో ఐదు అంతస్తుల్లో రాజగోపురాలు నిర్మించనున్నారు. కల్యాణ మండపం, అద్దాల మండపం, రథ, ఆర్జి, వాహన వంటి సేవలకు ప్రత్యేక మండపాలు, పుష్కరిణి కూడా నిర్మించడానికి మాస్టర్ ప్లాన్ రూపొందించారు. అయితే ఈ పనులు ఇప్పటి టెండర్లు ఆహ్వానించి గుత్తేదార్లను ఎంపిచ చేశారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

# సజ్జలకు రక్షణ కవచం

**విజయవాడ, నవంబర్ 29, పెన్ పవర్:**
వైసీపీ అధినేత వైఎస్ జగన్ పక్కన సజ్జల రామకృష్ణారెడ్డి ఒక్కరే ఇప్పుడున్నారు. అధికారంలో ఉన్న సమయంలో ఆయన పక్కన ఉన్నవారంతా ఒక్కొక్కరూ విడిచిపెట్టి వెళ్లిపోయారు. గతంలో వైఎస్ జగన్ తో పాటు సజ్జల రామకృష్ణారెడ్డి, మరికొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఆయన వెంట ఉండేవారు. అయితే అధికారులు అక్రమ మద్యం కేసులో అరెస్టయ్యారు. ఇప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డి ఒక్కరే మిగిలారు. సజ్జల రామకృష్ణారెడ్డి కూడా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొంత మౌనంగానే ఉంటూ వస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని శాఖలపై పెత్తనం చేసినట్లు నాడు ప్రతిపక్ష టీడీపీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో సజ్జలపై కేసులు నమోదవుతాయని భావించింది.అయితే కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ సజ్జల రామకృష్ణారెడ్డిపై కేసులు నమోదు కాకపోవడంతో టీడీపీ సోషల్ మీడియాలో పార్టీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. కానీ సజ్జల పై నమోదు చేయడానికి సరైన ఆధారాలు దొరకడం లేదని, అందుకే కేసులు నమోదు కావడం లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ పార్టీలో కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి యాక్టివ్ అయ్యారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి చంద్రబాబుపై కేసులు తిరగదోడతామని సజ్జల ప్రకటించడం చూస్తుంటే ఆయన కు ధైర్యం వచ్చినట్లే కనిపిస్తుంది. సజ్జల రామకృష్ణారెడ్డి జగన్ చెప్పే ఆదేశాలను అమలుపర్చి నాడు టీడీపీ, జనసేనలకు టార్గెట్ అయ్యారు. సజ్జల రామకృష్ణారెడ్డిపైన కూడా అనేక కేసులు నమోదయ్యాయి. అయితే వాటిలో ముందస్తుబెయిల్ తెచ్చుకున్న సజ్జల ప్రస్తుతం బిందాస్ గా ఉన్నారు.సజ్జల రామకృష్ణారెడ్డి విషయంలోనూ



ఆయన అటవీ భూములను ఆక్రమించారన్న ఆరోపణలపై కేసు నమోదుతో పాటు భూమిని కూడా స్వాధీనం చేసుకుంది. అయినా సరే అందులోనూ ఆధారాలు లభించలేదు. పది నెలల నుంచి మౌనంగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి తాజాగా ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నారు. సజ్జల యాక్టివ్ అవ్వడంతో ఇక నేతలు కూడా రోడ్డు మీదకు వస్తారని చెబుతున్నారు. జగన్ కూడా బెంగళూరు నుంచి విజయవాడకు టూర్ వేస్తుండటంతో రాష్ట్రంలో పార్టీని సజ్జల రామకృష్ణారెడ్డి చూసుకునేందుకు ఉపయోగపడుతున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి మరోసారి వైసీపీలో కీలకంగా మారుతున్నారు. జగన్ కూడా రాజీనామాలు చేసిన మాట విని ఆయనను పక్కన పెట్టే ప్రయత్నం చేయడం లేదు. రానున్న రోజుల్లో సజ్జల రామకృష్ణారెడ్డి మరింత కీలకంగా పార్టీలో మారనున్నారన్నది వాస్తవం.

# భవానీ దీక్ష విరమణ

## ఈవో వి.కె. శీనా నాయక్ సమీక్ష

**హైదరాబాద్ పెన్ పవర్: విజయవాడ:**శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో డిసెంబర్ 11 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న భవానీ దీక్ష విరమణ మహోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్లపై ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీ వి.కె. శీనా నాయక్ గారు ఆలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కార్యనిర్వాహక ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ కమిషనర్-1, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లు, గుమస్తాలు మరియు ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది హాజరయ్యారు.భవానీ దీక్ష విరమణ కార్యక్రమాలు డిసెంబర్ 11, 2025 న ఉదయం 8 గంగలకు ప్రారంభమై, డిసెంబర్ 15, 2025 న ఉదయం 10-30 గంటలకు మహా పూర్ణాహుతితో ముగుస్తాయి. ఈ ఐదు రోజుల వ్యవధిలో దాదాపు 7 లక్షల మందికి పైగా భవానీ భక్తులు దీక్ష విరమణకు ఇంద్రకీలాద్రికి తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా అగ్నిప్రతిష్టాపన, శత చండీయాగం, గిరి ప్రదక్షిణలు వంటి ప్రధాన క్రతువులు జరుగుతాయి.
భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు, వేచి ఉండే హాళ్లు, పార్కింగ్ స్థలాలు, ప్రసాదం, అన్నదానం పంపిణీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని అయన ఆదేశించారు.: భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు మరియు బందోబస్తు ప్రణాళికలు రూపొందించాలి. భవానీ దీక్షల విరమణ కారణంగా డిసెంబర్ 11 నుండి 16 వరకు అన్ని ఆర్జిత సేవలను తాత్కాలికంగా రద్దు చేసి, ఏకాంతంగా నిర్వహిస్తారు.
భవానీ మండల దీక్షలు నవంబర్ 1 నుండి 5 వరకు, అర్ధ మండల దీక్షలు నవంబర్ 21 నుండి 25 వరకు జరిగాయి. డిసెంబర్ 4వ తేదీన కలశజ్యోతి మహోత్సవం నిర్వహించబడుతుంది.
భవానీ దీక్ష విరమణలో భాగంగా మూడు హోమగుండాలు ఏర్పాటు చేస్తారని అయన వెల్లడించారు.

# దీక్షా దివస్ చారిత్రాత్మక రోజు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆనాడు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మొదలుపెట్టిన దీక్షాదివస్ చారిత్రాత్మకంగా నిలిచిపోతుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. శనివారం దీక్షాదివస్ సందర్భంగా మంథని పట్టణంలోని ప్రభుత్వ సామాజిక వైద్యశాలలోని రోగులకు బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ అంకురార్పణ, ఆవిర్భావానికి, అభివృద్ధికి దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలువడానికి దీక్షాదివస్ కారణమని, ఆనాడే బీజం పడిందన్నారు. దీక్షాదివస్‌తోనే రాష్ట్రంలోని ఉద్యమకారులు, సబ్బండవర్గాలు ఒక్కటై ముందుకు సాగామని, కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాధించుకున్నామని ఆయన తెలిపారు. ఆనాడు తెలంగాణాను వ్యతిరేకించినోళ్లు ఈనాడు తెలంగాణ రాష్ట్రంలో గొప్ప పదవులు అనుభవిస్తున్నారని, అందుకు కారణం తెలంగాణ సృష్టికర్త, తెలంగాణ గాంధీగా ఉన్న కేసీఆర్ కారణమని చెప్పచ్చున్నారు. తెలంగాణ లేకపోతే ఈనాడు రాష్ట్రంలో కాంగ్రెస్ అనేది ఉండేది కాదనే విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రతి ఏటా దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఏగోళపు శంకర్ గౌడ్, ఆరెపల్లి కుమార్, తగరం శంకర్ లాల్, కాయితి సమ్మయ్య, పుప్పాల తిరుపతి, గొబ్బూరి వంశీ, పిల్లి సత్యం, ఆసిఫ్ ఖాన్, ఇర్ఫాన్, జావేద్, మబ్బు నాగరాజు, బండారి శ్రీకాంత్, నరేంద్ర చారి లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# మజీద్ పూర్ బావర్చి రెస్టారెంట్లో యువకుడు అనుమానాస్పద మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రతుకుదెరువు కోసం వచ్చి ఓ యువకుడు అనుమానస్పదంగా ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు స్థానికుల కథనం ప్రకారం... వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన షేక్ అంజూమ్ (23) బ్రతుకుదెరువు నిమిత్తం వలస వచ్చి మేడ్చల్ జిల్లా మజీద్ పూర్ పరిధిలోని డైమండ్ బావార్చి రెస్టారెంట్ లో గత నాలుగు నుంచి వెయిటర్ గా పని జీవిస్తున్నాడు. సాయంత్రం విధులు ముగించుకొని రెస్టారెంట్ రూమ్ లోకి వెళ్లి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి . విషయాన్ని గమనించిన మిగతా వెయిటర్స్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం అస్పత్రికి తరలించారు.యువకుని మృతికి గల కారణాలు తెలియరాలేదు. శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సంపదను ఇతరులకు పంచినప్పుడే ఆనందం

## మాజీ ఉపరాష్ట్రపతి వెంక య్యనాయుడు...


**హైదరాబాద్ పెన్ పవర్:**సంపదను పెంచుకొని ఇతరులకు పంచినప్పుడే ఆనందం దక్కుతుం దని మాజీ ఉపరాష్ట్రపతి వెంక య్యనాయుడు అన్నారు. శిల్పారామంలో సుచిరిం డియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంకల్పివస్ కార్యక్రమాన్ని జాదవ్క పురస్కారం అందజేస్తున్న ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... ప్రకృతిలోని చెట్లు, నదులు, మూగజీవాలు మనకు ఎన్నో ఇస్తున్నాయి. ఇదే తరహాలో మానవశరీరం కూడా ఇతరులకు ఉప యోగపడాలన్నారు. అడవుల సంరక్షణకు పాటు పడుతూ 'ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరొందిన జాదవ్ పాయెంగ్ జీవితం స్ఫూర్తిదాకమన్నారు. జాదవ్ పాయెంగ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగ స్వాములు కావాలన్నారు. అనంతరం ఆయనకు వెంకయ్య నాయుడు చేతులమీదుగా 'సంకల్ప్ కిరణ్' పురస్కారాన్ని అందించి సత్కరించారు. తెలం గాణ వెదర్ మ్యాన్గా పేరొందిన బాలాజీ తరిణి, సామాజిక కార్యకర్త ఖ్వాజా మొయినుద్దీన్, విఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సి. ప్రవీణ్ కుమార్ యాదవ్, కంటెంట్ క్రియేటర్, వీడియో ఎడిటర్ పి.చంద్రశే ఖర్లకు సంకల్పసంజీవని పురస్కారాలను అంద జేసి సన్మానించారు. సుచిరిండియా ఫౌండేషన్ అధినేత లయన్ డా. వై. కిరణ్ పాల్గొన్నారు.

# డిసెంబర్ 1 నుంచి సీఎం జిల్లాల పర్యటన



**హైదరాబాద్ పెన్ పవర్::**సీఎం రేవంత్ రెడ్డి డిసెంబర్ 1 నుంచి 9 వరకు జిల్లాల్లో పర్యటించనున్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సీఎం ఈ పర్యటనలు చేయనున్నారు. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో సీఎం పర్యటన పట్టణ ప్రాంతాలకే పరిమితం అవుతుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 1 నుంచి మహబూబ్ నగర్ జిల్లా మక్తల్, 2న ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో సీఎం పర్య టించనున్నారు.

# కారు ఢీకొని మునిసిపల్ కార్మికుడు మృతి



**కూకట్ పల్లి పెన్ పవర్:**కూకట్పల్లిలో రోడ్డు ప్రమాదం లో చెట్లకు నీళ్ళు పోస్తున్న మున్సిపల్ కార్మికుడు మృతి చెందాడు. కూకట్పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో ఉదయం చెట్లకు నీళ్లు పోస్తున్న మున్సిపల్ కార్మికుడిని కారు అతి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**హైదరాబాద్ పెన్ పవర్:**వినుకొండ నియోజకవర్గం, నూజెండ్ల మండలం, తలార్లపల్లి గ్రామంలో 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శనివారం పాల్గొన్నారు. ఆయన స్వయంగా మిరప పొలంలోకి వెళ్లి, రైతన్నలతో కలిసి వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మిరప సాగులో ఎదురవుతున్న సమస్యలు, ప్రస్తుత పంట పరిస్థితులు, ప్రభుత్వం నుండి ఆశిస్తున్న సహాయం తదితర అంశాలపై రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సానుకూలంగా స్పందించిన చీఫ్ విప్, వారి సమస్యలను త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అండగా ఉంటామని ఈ సందర్భంగా జీవీ పేర్కొన్నారు.

# మరో 20 వేల ఎకరాలకు భూ సేకరణ

**విజయవాడ, నవంబర్ 29, పెన్ పవర్:** అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు రెండో దశ భూసేకరణ తప్పదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. పెట్టుబడులు, ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్‌సిటీ వంటి వాటికి భూములు అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో రెండో దశ భూసేకరణకు సంబంధించి చర్చించారు. 7 గ్రామాల పరిధిలో మరో 16,666 ఎకరాల భూసమీకరణకు సీఆర్డీఏకు అనుమతి ఇచ్చింది రాష్ట్ర మంత్రివర్గం. ప్రభుత్వ భూమితో కలిపి మొత్తంగా 20 వేల ఎకరాలు సేకరించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు ల్యాండ్ పూలింగ్ చేపట్టే గ్రామాలను మంత్రివర్గం పరిశీలించినట్లు తెలుస్తోంది.ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడానికి రెండోదశ భూసమీకరణ తప్పదని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం (నవంబర్ 27) అన్నారు. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్న సంస్థలకు భూములు లేవని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్‌సిటీ, రైల్వేస్టేషన్ నిర్మించేందుకు కూడా భూములు అవసరమని చెప్పారు. ఇవన్నీ వస్తేనే అమరావతి ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నేపథ్యంలో రెండో దశ భూసేకరణ చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నట్లు తీసుకుంది. 7 గ్రామాల పరిధిలో మరో 16,666 ఎకరాల భూసమీకరణకు సీఆర్డీఏకు అనుమతి ఇచ్చే ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ప్రభుత్వ భూమితో కలిపి రెండో దశలో 20 వేల ఎకరాల భూమిని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో భూసేకరణతో పాటు దాదాపు 25కుపైగా అజెండా అంశాలపై చర్చించారు.ఈ కేబినెట్ సమావేశంలో భూసేకరణ చేయబోయే ప్రాంతాలను పరిశీలించినట్లు సమాచారం. హరిశ్చంద్రపురం, వైకుంఠపురం, ఎంద్రాయి, కర్లపూడి, వడ్డమాను, పెదమద్దూరు, పెదపరిమి వంటి ప్రాంతాలను పరిశీలించినట్లు తెలుస్తోంది. ఆయా గ్రామాల్లో భూ లభ్యత, రికార్డులు, యాజమాన్యం, అభ్యంతరాలు వంటి అంశాలపై అధికారులు నివేదికలు సమర్పించినట్లు చెబుతున్నారు. వైకుంఠపురంలో 3,361 ఎకరాలు, పెదమద్దూరులో 1,145 ఎకరాలు, కర్లపూడిలో 2,944 ఎకరాలు, హరిశ్చంద్రపురంలో 2,418 ఎకరాలు , వడ్డమానులో 1,913 ఎకరాలు, పెదపరిమిలో 6,513 ఎకరాలు, ఎంద్రాయిలో 2,166 ఎకరాలు సేకరించాలనుకుంటున్నట్లు తెలుస్తోంది.రైతుల వద్ద నుంచి సేకరించిన భూమితో పాటు ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూములతో కలిపి మొత్తం 20,494 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని సమాచారం. త్వరలో రెండో విడత ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే అమరావతి నిర్మాణానికి మొదటి విడతలో రైతుల నుంచి 34,000 ఎకరాలు సమీకరించారు. ఇప్పుడు రెండో విడతకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. వీటికి అదనంగా 16,000 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం సీఆర్డీఏకు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. అంటే.. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి మొత్తం దాదాపు 70,0 00 ఎకరాల భూమి సిద్ధమవుతోందన్నమాట.కాగా, రాజధాని రైతులతో గురువారం సచివాలంలో సమావేశమయ్యారు ముఖ్యమంత్రి చంద్రబాబు. రెండున్నర గంటల పాటు సాగిన మీటింగ్‌లో రాజధాని అభివృద్ధికి రైతులు సహకరించాలని కోరారు. రైతులు సహకరించకపోతే.. అమరావతి ఒక మున్సిపాలిటీగా మిగిలిపోతుందని అన్నారు. ప్రతి చిన్న విషయానికి సోషల్ మీడియాకు ఎక్కి రచ్చ చేయొద్దని, అంతర్గత విభేదాలతో సమస్యను పెద్దది చేయొద్దని సున్నితంగా హెచ్చరించారు. అమరావతి రైతుల్లో జేఏసీలు ఎక్కువగా ఉన్నాయని.. అందులో ఐకమత్యం లేదన్నారు. అందరూ ఒకేతాటిపై నిలబడి అమరావతి అభివృద్ధి కమిటీగా ఏర్పడాలని చంద్రబాబు సూచించారు.


# ఆ మూడు ఆస్పత్రులకు మంచి రోజులు

**గుంటూరు, నవంబర్ 29, పెన్ పవర్:** ప్రజారోగ్యం, ఆసుపత్రుల అభివృద్ధిపై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందులో భాగంగా మూడు ఏరియా ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు కేటాయించింది. పిఠాపురం, మంగళగిరి, చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం ఏపీ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగానికి 22 కోట్ల 74 లక్షల రూపాయలు అదనపు నిధులు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖ కార్యదర్శి నుంచి దీనికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల అయ్యాయి.ప్రజారోగ్యంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం కీలక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రులలో మౌలిక వసతుల కల్పన, అధునాతన వైద్య చికిత్సలు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే మూడు నియోజకవర్గాలకు ఏపీ ప్రభుత్వం శుభవార్త వినిపించింది. రాష్ట్రంలోని మూడు ఏరియా ఆస్పత్రులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిధులు కేటాయించింది. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగానికి ఏపీ ప్రభుత్వం ఈ మేరకు రూ.22.74 కోట్లు అదనపు నిధులు కేటాయించింది. మంగళగిరి. పిఠాపురం ఏరియా ఆస్పత్రి , చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రుల అభివృద్ధి కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు ఏపీ వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.మరోవైపు మంగళగిరి ఏరియా ఆస్పత్రి సామర్థ్యం ప్రస్తుతం 30 పడకలు మాత్రమే. ప్రజా అవసరాల నేపథ్యంలో ఈ ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. మంగళగిరి ఏరియా ఆస్పత్రిని100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని.. ఈ ఆస్పత్రికి అదనంగా 73 పోస్టులు కేటాయించాలని నిర్ణయించారు. ఆ నిర్ణయానికి అనుగుణంగా అదనపు పడకలు, అదనపు పోస్టుల కోసం రూ.52.20 కోట్లు కూడా కేటాయించారు. అలాగే మంగళగిరి ఏరియా ఆస్పత్రిని చినకాకాని వద్ద ఉన్న వైవీసీ క్యాన్సర్ ఆసుపత్రి స్థలంలో నిర్మించాలని నిర్ణయిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనం పాడవటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు మంత్రి నారా లోకేష్ మంగళగిరి ఏరియా ఆస్పత్రి నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ ఆస్పత్రిని కార్పొరేట్ వసతులతో నిర్మించాలని.. అత్యాధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని అధికారులకు ఇప్పటికే సూచనలు చేశారు. మంగళగిరి ఏరియా ఆస్పత్రిని గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్.. రెండు అంతస్తులో నిర్మిస్తున్నారు.రోగులకు ఉపయోగపడేలా ఆస్పత్రిలో లిఫ్ట్ ఏర్పాటు చేయనున్నారు. విశాలమైన పార్కింగ్ స్థలం కేటాయించనున్నారు. ఈ ఏరియా ఆస్పత్రికి మంగళగిరి నియోజకవర్గం నలుమూలల నుంచి చికిత్స కోసం ప్రజలు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రోగులతో పాటుగా వారి బంధువుల కూడా అసౌకర్యం కలగకుండా వసతి ఏర్పాట్లు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనితో పాటుగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం ఏరియా ఆస్పత్రికి కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

# మారనున్న సింహాచలం రూపురేఖలు

**విశాఖపట్టణం, నవంబర్ 29, పెన్ పవర్:** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన జరిగింది. నాల్కో సంస్థ సీఎస్ఆర్ కింద్ ఇచ్చిన రూ. 1.58 కోట్ల నిధులతో చేపట్టిన షెడ్లకు శంఖుస్థాపన చేశారు. ఇక కోల్‌కతాకు చెందిన ఓ భక్తుడు ఇచ్చిన రూ. 45 లక్షల విరాళంతో తొలిపావంచా వద్ద నిర్మించనున్న షెడ్డుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంఖుస్థాపన చేశారు. అంతేకాకుండా రూ. 3 కోట్లతో నిర్మించిన టీఎంఎస్ షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. సింహాచల ఆలయ ప్రక్షాళన చేసి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు.రాష్ట్రంలో ప్రధాన దేవాలయాల్లో ఒకటిగా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రం వెలుగొందుతోంది. విశాఖపట్నం జిల్లాలో కొలువై ఉన్న సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకోవడానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఆయితే ప్రస్తుతం ఈ ప్రసిద్ధ ఆలయం రూపురేఖలు మారుతున్నాయి. భక్తులు ఇచ్చిన విరాళాలలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే శ్రీచైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ బొప్పన ఝాన్సీ లక్ష్మీబాయి.. రూ.3 కోట్లు వెచ్చించి సింహగిరిపై టీఎంఎస్ (టెన్సిల్ మెంబ్రేన్ షెల్టర్) షెడ్డు నిర్మించారు.కాగా, ఈ టీఎంఎస్ షెడ్డు ప్రారంభోత్సవం సింహగిరిపై జరిగింది. ఝాన్సీ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో.. ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి గణబాబు పాల్గొన్నారు. టీఎంఎస్ షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడారు. కేవలం వంద రోజుల వ్యవధిలో.. నాణ్యతలో ఏమాత్రం రాజీ పడకుండా నిర్మాణాన్ని పూర్తి చేశారని చెప్పారు. దాతలకు, గుత్తేదారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రతినిధులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.ఈ షెడ్డు ప్రారంభంతో పాటు పలు అభివృద్ధి పనుల శంఖుస్థాపన కార్యక్రమాల్లో గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. సింహాచలం దేవస్థానంలో వైసీపీ పాలనలోని అవశేషాలను తొలగిస్తామన్నారు. గత ప్రభుత్వంలోని కొందరు సింహాచల క్షేత్రాన్ని వివాదాలకు చిరునామాగా మార్చారని.. తాము ఈ దేవస్థానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు. అంతేకాకుండా గత కొన్నాళ్లుగా స్వామివారి ఆభరణాల లెక్కల్లో తేడాలు వస్తున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఉద్యోగుల వ్యవహారాలు, తదితర ఆరోపణలు ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయని అన్నారు. ప్రసాద్ పథకం పనులు త్వరలోనే తిరిగి ప్రారంభిస్తామని వెల్లడించారు.సింహాచల కొండపై విరాళాలతో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. అందులో లోవతోటలో రూ. 98 లక్షలతో, ఆలయ ప్రాకారం చుట్టూ రూ. 60 లక్షలతో.. నాల్కో సంస్థ కార్పొరెట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో చేపట్టిన షెడ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. దాంతో పాటు కోల్‌కతాకు చెందిన దాత ఇచ్చిన విరాళంతో కొండ దిగువన తొలిపావంచా దగ్గర రూ. 45 లక్షలతో నిర్మించనున్నారు

# కూటమి చేతికి మండలి



**విజయవాడ, నవంబర్ 29, పెన్ పవర్:**
వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. వారి రాజీనామాలు విషయంలో కోర్టు నాలుగు వారాల పాటు గడువు విధించింది. జయ మంగళం వెంకట్రమణ కోర్టును ఆశ్రయించడంతో ఈ మేరకు తీర్పు వచ్చింది. దీంతో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం శాసనమండలి చైర్మన్ పై ఏర్పడింది. గత ఏడాది కాలంగా ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారం నలుగుతూనే ఉంది. వైసీపీ రాజకీయ అవసరాల కోసం శాసనమండలి అవసరం. చైర్మన్ మోసేన్ రాజు ఆ పార్టీకి చెందిన నేత కావడంతో హై కమాండ్ నుంచి ఇంతవరకు ఎమ్మెల్సీల రాజీనామా పై ఆదేశాలు రాలేదు. దీంతో చైర్మన్ సైతం ఆ రాజీనామాలను ఆమోదించలేదు. అయితే ఇదే శాసనమండలిని జగన్మోహన్ రెడ్డి వ్యతిరేకించారు. ఇప్పుడు అదే శాసనమండలి ఆయనకు అక్కరకు వస్తోంది.ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చాలామంది వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీలు పార్టీకి గుడ్ బై చెప్పారు. కర్రీ పద్మశ్రీ, పోతుల సునీత, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జయ మంగళ వెంకటరమణ, మర్రి రాజశేఖర్, జాకీయా ఖానం తదితర ఎమ్మెల్సీలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. అయితే రాజీనామా ఆమోదానికి నోచుకోకపోవడంతో వారు తమకు నచ్చిన కూటమి పార్టీల్లో చేరారు. అయితే ఇందులో జనసేనలో చేరిన జయ మంగళం వెంకటరమణ కోర్టును ఆశ్రయించారు. నాలుగు వారాల్లో ఒక నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. అయితే రాజీనామాలను ఆమోదించిన మరుక్షణం మరికొంతమంది రాజీనామా చేసే అవకాశం ఉంది. అదే జరిగితే శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం తగ్గిపోయినట్టేఇదే శాసనమండలిని జగన్మోహన్ రెడ్డి వ్యతిరేకించారు. 2019లో వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 151 సీట్లతో ఘనవిజయం సాధించింది. అయితే అప్పటికే తెలుగుదేశం పార్టీకి శాసనమండలిలో బలం ఉంది. ఆ పార్టీ నేత మండలి చైర్మన్ గా ఉండేవారు. కీలక బిల్లులతో పాటు వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలకు శాసనమండలిలో తెలుగుదేశం పార్టీ అభ్యంతరాలు చెప్పేది. బిల్లులను అడ్డగించేది. దీంతో జగన్మోహన్ రెడ్డి ఏకంగా శాసనమండలిని రద్దు చేయాలని కోరుతూ కేంద్రానికి నివేదిక ఇచ్చారు. అయితే అప్పట్లో కేంద్రం దీనికి సమతం తెలపలేదు. అప్పట్లో కేంద్రం అనుమతి ఇచ్చి ఉంటే ఇప్పటికే రద్దు జాబితాలో శాసనమండలి చేరిపోయేది.2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమికి అనుకూలంగా పనిచేసారని రఘురాజు అనే వైసిపి ఎమ్మెల్సీ పై వేటు వేశారు చైర్మన్ మోసేన్ రాజు. విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ గా ఉన్న రఘురాజు పై వేటు పడడంతో ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికకు సిద్ధపడింది. కానీ కోర్టు స్టే విధించడంతో ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది. అయితే స్వయంగా ఎమ్మెల్సీలు రాజీనామా చేస్తే మాత్రం చైర్మన్ ఆమోదం తెలపడం లేదు. అయితే ఇప్పుడు జయ మంగళం వెంకటరమణ కోర్టును ఆశ్రయించడంతో.. కోర్టు ఇచ్చే ఆదేశాలు కీలకంగా మారనున్నాయి. ఎమ్మెల్సీల రాజీనామా ఆమోదం తెలిపితే మాత్రం శాసనమండలిలో మిగతా ఎమ్మెల్సీలు సైతం రాజీనామా బాటకు అవకాశం ఉంది. అదే జరిగితే శాసనమండలి సైతం టిడిపి కూటమికి చిక్కినట్టే.

# తిరుమలలో ఏం జరుగుతోంది..

**తిరుమల, నవంబర్29 పెన్ పవర్:**
ఆ రెండు కేసులు ఏపీ పాలిటిక్స్‌ను షేక్ చేస్తున్నాయ్. కోట్లాది మంది భక్తుల విశ్వాసం..భక్తుల కొంగుబంగారంగా ఉన్న తిరుమల శ్రీవారి..కొండ చుట్టూ తిరుగుతున్న ఆ రెండు ఇష్యూస్‌పై రచ్చ కంటిన్యూ అవుతోంది. పరకామణి చోరీ కేసు అయితే బిగ్ టర్న్ తీసుకుంది. పరకామణి చోరీ కేసులో నిందితులను ఎప్పుడో గుర్తించారు. అతడి ఆస్తులపై దర్యాప్తు నడుస్తోంది. కీలక సాక్షిగా ఉన్న సతీష్‌కుమార్ అనే అధికారి అనుమానాస్పద మృతి చెందడంతో పరకామని కేసు క్లైమాక్స్‌లో బిగ్ టర్న్ తీసుకున్నట్లు అయ్యింది.ఇక హుండీ చోరీ కేసులో టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని సీఐడీ విచారించింది. ప్రశ్నలు వేసి ఏం జరిగిందనే దానిపై ఆరా తీసింది. పరకామణి చోరీ చేసిన రవికుమార్ ఆస్తుల జప్తులో ఏం జరిగింది.? ఎంత చోరీ జరిగితే..ఎన్ని ఆస్తులు జప్తు చేశారు.? రాజీ కుదర్చిందెవరు.? ఎవరి ఒత్తిడి వల్ల ఇదంతా చేశారని.? ఆరా తీస్తుంది సీఐడీ. నిందితులతో భూమన, ధర్మారెడ్డి, వైవీసుబ్బారెడ్డికి ఉన్న లింకులపై కూపీ లాగుతోంది. ఈ క్రమంలోనే సంచలనం సృష్టించిన టీటీడీ పరకామణి కేసులో దర్యాప్తును స్పీడప్ చేశారు సీఐడీ అధికారులు. టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని సీఐడీ మూడుసార్లు ప్రశ్నించిందిపరకామణిలో దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తిని కాపాడేందుకు గత ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తులే దగ్గరుండి వ్యవహారాన్ని నడిపించారని, చివరకు కేసు పెట్టినా కూడా లోక్ అదాలత్‌లో కొట్టేసేలా ఒత్తిడి తెచ్చారని ఆరోపణలున్నాయి. ఇదంతా జరగడానికి కోట్లు చేతులు మారాయనే అభియోగాలు లేకపోలేదు. ఈ క్రమంలో అన్ని కోణాల్లో దర్యాప్తు అధికారులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కేసు అతిపెద్ద చిక్కుముడిగా మారింది. కీలక సాక్షి లేటెస్ట్‌గా మృతి చెందడంతో కేసు మరింత జఠిలం అవుతోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయ్. పరకామణి కేసులో కూడా మరోసారి వైవీ సుబ్బారెడ్డికి సీఐడీ నుంచి పిలుపురావడం రకరకాల చర్చకు దారితీస్తోంది.ఇక తిరుమల కల్తీ నెయ్యి కేసు కూడా కొత్త టర్న్ తీసుకుంటోంది. సుప్రీం ఆదేశాలతో ఏర్పాటైన స్పెషల్ సిట్..ఇప్పటికే టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని విచారించింది. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ అప్పన్నను అరెస్ట్ చేసింది. లేటెస్ట్‌గా వైవీ సుబ్బారెడ్డిని కూడా హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో ప్రశ్నించింది స్పెషల్ సిట్ టీమ్. అయితే 2019 నుంచి 2014 వరకు జరిగిన నెయ్యి సరఫరాపై మాత్రమే ఎందుకు విచారణ చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు వైవీ సుబ్బారెడ్డిపదేళ్లలో నెయ్యి సప్లైపై విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. లడ్డూ ఆరోపణలపై పాలీ గ్రాఫ్ పరీక్షకు సిద్దంగా ఉన్నట్లు ప్రకటించిన సుబ్బారెడ్డి..రాజకీయాలకు ఆలయాలను వాడుకుంటున్నారని ఆరోపించారు. స్వామివారి లడ్డూ ప్రసాద విషయంలో తనపై విషప్రచారం చేస్తున్నారని..కల్తీ నెయ్యి వ్యవహారంలో లైడిటెక్టర్ టెస్టుకైనా సిద్ధమని అంటున్నారు వైవీ సుబ్బారెడ్డి. తనకు కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు ఉండగా..నెయ్యిలో అవినీతి ఎందుకు చేస్తానని ప్రశ్నిస్తున్నారు. పరకామణి విషయంలో ఏం జరిగిందో తనకు తెలియదంటున్న వైవీ సుబ్బారెడ్డి..శ్రీవారి సేవలో నీతి నిజాయితీతో పనిచేశానని చెప్తున్నారు.అటు దర్యాప్తు సంస్థల విచారణ కొనసాగుతుండగానే..ఏపీ ప్రభుత్వం మాత్రం నిందితుల పట్ల కఠినంగా ఉంటామని తేల్చి చెబుతోంది. తప్పుచేసిన వారిని శ్రీవారు వదిలిపెట్టరని..శిక్ష అనుభవించాల్సిందేనని హెచ్చరిస్తోంది. అయితే కల్తీ నెయ్యి కేసులో సిట్..పరకామణి కేసులో సీఐడీ దర్యాప్తు స్పీడప్ అవడం ఉత్కంఠ రేపుతోంది. ఓవైపు విచారణ కొనసాగుతుండగానే..ఓవైపు కల్తీ నెయ్యి..ఇంకోవైపు పరకామణి వ్యవహారంపై.. కూటమి, వైసీపీ మధ్య మాటల యుద్ధం సాగుతోంది.సమయం, సందర్భం దొరికినప్పుడల్లా కూటమి లీడర్లు రియాక్ట్ అవడం..తామేం తప్పు చేయలేదని వైసీసీ లీడర్లు వివరణ ఇచ్చుకుంటుండం..హాట్ టాపిక్‌గా నడుస్తోంది. పరకామణి కేసుతో పాటుకల్తీ నెయ్యి ఇష్యూలో కూడా వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి ఇద్దరు విచారణను ఫేస్ చేస్తుండటం వైసీపీకి హెడెక్‌గా మారింది. భూమన కరుణాకరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి చుట్టూ ఈ రెండు కేసుల విచారణ కొనసాగుతుండటం బర్నింగ్ టాపిక్ అవుతోంది.అయితే ఈ ముగ్గురు వైసీపీ అధినేతకు జగన్‌కు సన్నిహితులు. వైవీ సుబ్బారెడ్డి అయితే జగన్‌కు బాబాయ్ అవుతారు. భూమన వైఎస్సార్ నుంచి జగన్ వరకు వాళ్ల ఫ్యామిలీ వెంట నడిచిన నేత. ఇక ధర్మారెడ్డి వైసీపీ హయాంలో టీటీడీలో అన్నీ తానై వ్యవహరించారు. ఈ ముగ్గరిని కార్నర్ చేసి..జగన్‌ను రాజకీయంగా వీక్ చేయాలని కూటమి కుట్ర చేస్తోందని ఆరోపిస్తోంది వైసీపీ. పరకామణి కేసు..కల్తీ నెయ్యి ఎపిసోడ్‌లో కన్‌క్లూజన్ ఎప్పుడో వేచి చూడాలి మరి

# 3 లక్షల కోట్లు దాటిన వైజాగ్ డేటా సెంటర్

**విశాఖపట్టణం, నవంబర్ 29, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ల హబ్గా రూపుదిద్దుకుంటోంది. టెక్ దిగ్గజాలు, ప్రపంచ స్థాయి సంస్థలు ఇక్కడ డేటా సెంటర్ల ఏర్పాటుకు క్యూ కట్టడంతో, మొత్తం పెట్టుబడులు ఏకంగా రూ. 3 లక్షల కోట్లకు పైగా చేరినట్లు తెలుస్తోంది.తాజాగా ఈ పెట్టుబడుల సునామీకి ఊతం ఇస్తూ రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో భారీ అడుగు వేసింది. రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ , డిజిటల్ రియాల్టీ వంటి సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటైన 'డిజిటల్ కనెక్షన్' విశాఖలో ఒక గిగావాట్ సామర్థ్యం గల అత్యాధునిక ఏఐ డేటా సెంటర్‌ను నిర్మించనుంది.ఈ ప్రాజెక్టు కోసం రిలయన్స్ జాయింట్ వెంచర్ సుమారు రూ. 98,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనుంది. 1,000 మెగావాట్ల హైపర్‌స్కేల్ ఏఐ డేటా సెంటర్. సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేయనున్నారు.

2030 నాటికి ఇది అందుబాటులోకి వస్తుందని అంచనా. రిలయన్స్‌తో పాటు ఇప్పటికే ప్రపంచ దిగ్గజ సంస్థలు విశాఖలో భారీ పెట్టుబడులు ప్రకటించాయి. దాదాపు రూ. 1.35 లక్షల కోట్లకు పైగా పెట్టుబడితో 1 %+ఔ% సామర్థ్యం గల ఏఐ డేటా సెంటర్. రూ. 1.10 లక్షల కోట్లతో డేటా సెంటర్ల నిర్మాణం. రూ. 16,000 కోట్ల పెట్టుబడితో 550 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్ల కాంప్లెక్స్. సబ్‌సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ల ఏర్పాటు, సిఫీతో కలిసి 500 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ (రూ. 15,266 కోట్లు)మొత్తంగా, రాష్ట్ర ప్రభుత్వం 2030 నాటికి 6,000 మెగావాట్ల డేటా సెంటర్‌ల సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 3.65 గిగావాట్లకు పైగా ఒప్పందాలు కుదిరాయి. ఈ భారీ పెట్టుబడులతో విశాఖపట్నం రానున్న రోజుల్లో భారతదేశ 'డేటా రాజధాని'గా అవతరించడం ఖాయమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీని ద్వారా వేల సంఖ్యలో కొత్త ఉద్యోగాలు, నూతన సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రంగా వైజాగ్ మారనుంది.

# అనుభవం కన్నా అడ్డంకులే ఆటంకాలు

**విజయవాడ, నవంబర్ 29, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవాన్ని ఉపయోగించి రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ ఈసారి మాత్రం ఆయనకు అనుభవం కన్నా అడ్డంకులే ఆటంకాలుగా మారే అవకాశాలున్నాయి. నిధుల కొరతతో పాటు సంక్షేమాన్ని అమలు చేయడం కత్తిమీద సాముగా మారింది. ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలను తిప్పికొట్టాలన్న ప్రయత్నంలో ఆయన ఇచ్చిన హామీలను అమలు చేశామని చెప్పేశారు. మహిళలకు నెలకు పదిహేను వందల రూపాయలు ఆడబిడ్డ పథకం కింద.. నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయలు ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీని ప్రతిపక్ష వైసీపీ పదే పదే గుర్తు చేస్తుంది.రెండు పథకాలు అమలు చేయాలంటే అంత సులువు కాదు. ఆడబిడ్డ పథకం అమలు చేయాలంటే ప్రభుత్వానికి చెందిన ఆస్తులు అమ్మాల్సిందేనని

అచ్చెన్నాయుడు గతంలో చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకోవాలి. అర్హులు ఎందరు? ఎవరికి ఇస్తారన్న దానిపై పథకం క్లిక్ అయ్యేది ఆధారపడి ఉంటుంది. ఏదో కొందరికి ఇచ్చామని మమ అనిపించడానికి వీలులేదు. మహిళల్లో ఒకరికి వచ్చి పది మందికి పథకం రాకపోతే ఇరవై మంది వ్యతిరేకమవుతారు. నిరుద్యోగ భృతి కూడా అంతే. అది అమలుకు సాధ్యమయ్యే హామీ కాదు. నిరుద్యోగ యువతకు నెలకు మూడు వేల రూపాయలు ఇవ్వాలంటే ఖజానా సరిపోదు. అందుకే చంద్రబాబు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.గతంలో సంక్షేమంపై చంద్రబాబు ఎన్నడూ ఇలా టెన్షన్ పడలేదు. ఆయన దృష్టంతా అభివృద్ధిపైనే ఉంది. గత ప్రభుత్వం అప్పులు చేసిందని, విధ్వంసం నుంచి బయటపడేస్తున్నామని చెప్పాలనుకున్నా కుదిరే పని కాదు. ఎందుకంటే ఇప్పటికే రెండేళ్ల సమయం పూర్తయింది. ప్రస్తుతం గ్రౌండ్ చేసిన హామీలను అమలు చేయడానికే అప్పులు చేయాల్సి వస్తుంది.
ప్రతి నెల అప్పుల కోసం ఢిల్లీ వైపు చూడాల్సి వస్తుంది. మరొకవైపు రాజధాని నిర్మాణం, పోలవరం పూర్తి చేయడం వంటివి కూడా సవాలుగా మారుతున్న సమయంలో చంద్రబాబు నాయుడు ఈ రెండు పథకాలను అమలు చేయడానికి అవసరమైన నిధులను సమకూర్చుకోవడానికి తలకిందులు తపస్సు చేసినా సాధ్యం కాదన్నది ప్రతిపక్షం ఆలోచన. అందుకే ఆరెండింటిపైనే ఎక్కువగా విమర్శలు చేస్తున్నారు. మరి చంద్రబాబు ఈ రెండు పథకాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాలి

## క్రికెట్ ప్రియులకు గుడ్ న్యూస్.. WPL షెడ్యూల్ రిలీజ్.. తొలి మ్యాచ్ ఎవరెవరి మధ్య అంటే..?





**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ ప్రియులకు గుడ్ న్యూస్ గుడ్ న్యూస్. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు డబ్ల్యూపీఎల్-2026 పూర్తి షెడ్యూల్?ను శనివారం (నవంబర్ 29) బీసీసీఐ ప్రకటించింది. 2026, జనవరి 9వ తేదీన డబ్ల్యూపీఎల్ టోర్నీకి తెర లేవనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు తొలి మ్యాచ్?లో తలపడనున్నాయి. ఈ ఓపెనింగ్ మ్యాచ్?కు నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం అతిథ్యం ఇవ్వనుంది. 2025, ఫిబ్రవరి 5వ తేదీన ఫైనల్ మ్యాచ్ జరగనుంది. మొత్తం 28 రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్ ముంబై, వడోదరలోని రెండు వేదికలలో జరగనుంది. తొలి 11 మ్యాచులు నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో జరగనుండగా.. ఫిబ్రవరి 3న జరిగే ఎలిమినేటర్, ఫైనల్‌తో సహా టోర్నమెంట్‌లోని మిగిలిన మ్యాచ్‌లకు వడోదరలోని కోటంబి స్టేడియం అతిథ్యం ఇవ్వనుంది. పురుషుల అండర్-19 ప్రపంచ కప్, పురుషుల T20 ప్రపంచ కప్ వంటి అంతర్జాతీయ టోర్నీలకు క్లాష్ కాకుండా పకడ్బందీగా డబ్ల్యూపీఎల్ షెడ్యూల్ రూపొందించారు. ఇక.. డిఫెండింగ్ ఛాంపియన్స్ ముంబై ఇండియన్స్ మూడవ టైటిల్‌పై కన్నేయగా.. మూడు సీజన్లలో రన్నరప్‌గా నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ఈసారి ఎలాగైనా టైటిల్ గెలవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. మరోవైపు ఆర్సీబీ రెండోసారి డబ్ల్యూపీఎల్ విజేతగా నిలవాలని ఉవ్విళ్లూరుతోంది. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా టైటిల్ రౌండ్‌కు చేరుకోని గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్జ్ ఈసారి టైటిల్ గెలవాలనే కసితో బరిలోకి దిగుతున్నాయి.

## ఫ్యూచర్ గురించి ఊహాగానాలు పట్టించుకోవద్దు.. ముందు మేం చెప్పినట్లు చెయ్: రోహిత్‌కు BCCI మెసేజ్



**హైదరాబాద్ పెన్ పవర్:** టెస్టులు, టీ20 లకు గుడ్ బై చెప్పిన రోహిత్ శర్మ ఫ్యూచర్ పై క్రికెట్ ఫ్యాన్స్ లో చాలా రోజులుగా గందరగోళం నెలకొంది. 2027 వరల్డ్ కప్ లో హిట్ మ్యాన్ ఉంటారా..? ఉండరా..? అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతూనే ఉన్నాయి. ఈ విషయంలో బీసీసీఐ రోహిత్ శర్మకు క్లారిటీ ఇచ్చింది. అందుకు సంబంధించి డైరెక్ట్ మెసేజ్ పంపడం చర్చనీయాంశంగా మారింది. రోహిత్ శర్మ 2024 జూన్ 29న టీ20 లకు, 2025 మే 7న టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాడు. దీని తర్వాత ఇంటర్నేషన్ క్రికెట్ లో రోహిత్ ఫ్యూచర్ ఎలా ఉండబోతుందనే చర్చలు కొనసాగుతున్న వేళ.. బీసీసీఐ రోహిత్ తో మాట్లాడటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఫామ్, ఫిట్నెస్ కారణంగా రోహిత్ పై వేటు పడుతుందనే చర్చలు నడుస్తున్న వేళ.. ఆస్ట్రేలియాతో జరిగిన మూడు వన్డేల సిరీస్ లో.. ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీ చేయటమే కాకుండా టోర్నమెంట్ లో టాప్ స్కోరర్ గా నిలిచి ఆశ్చర్యపరిచాడు హిట్ మ్యాన్. సౌతాఫ్రికాతో వన్డే సిరీస్ కు మళ్లీ జాయిన్ అవుతున్నాడు. రాంచీ, రాయిపూర్, వైజాగ్ లో నవంబర్ 30, డిసెంబర్ 3, డిసెంబర్ 6 తేదీలలో సౌతాఫ్రికాతో వన్డేలు ఉన్నాయి. వన్డేల ముందు బీసీసీఐ రోహిత్ మాట్లాడటం ఆసక్తిగా మారింది.

**బీసీసీఐ ఏం చెప్పింది..?**

సౌతాఫ్రికాతో తొలి వన్డేకు ముందు నవంబర్ 29న రోహిత్ కు మెసేజ్ పంపింది బీసీసీఐ. ఈ సందర్భంగా ఫిట్ నెస్, పర్ఫార్మెన్స్ పైనే ఫోకస్ చేయమని.. ఫ్యూచర్ గురించిన ఊహాగానాలను పట్టించుకోవద్దని సూచించింది. ఆస్ట్రేలియా సిరీస్ లో చూపిన అగ్రెసివ్ బ్రాండ్ క్రికెట్ ను కంటిన్యూ చేయాలని రోహిత్ కు చెప్పింది. రోహిత్ ఫియర్లెస్ బ్యాటర్. ఆస్ట్రేలియాలో కండిషన్స్ దారుణంగా ఉంటాయి. అయినప్పటికీ సిరీస్ లో హైయెస్ట్ రన్ స్కోరర్ గా నిలిచాడు. అదే విధంగా ప్రస్తుత సిరీస్ లో కోహ్లీతో కలిసి టీమిండియాను లీడ్ చేయాలని సూచించింది. యంగ్ బ్యాటర్స్ లో కాన్ఫిడెన్స్ నింపాల్సిందిగా సూచించింది.

**సౌతాఫ్రికా సిరీస్ తర్వాత రోకో ఫూచర్ పై నిర్ణయం:**

2027 వరల్డ్ కప్ ను దృష్టిలో ఉంచుకుని రోహిత్, కోహ్లీ ఫ్యూచర్ పై దృష్టి సారించిన బీసీసీఐ.. సౌతాఫ్రికాతో సిరీస్ తర్వాత ఈ అంశంపై మీటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. వాళ్ల ఫ్యూచర్ గురించి క్లారిటీ ఇవ్వాల్సిన బాధ్యత ఉందని.. బీసీసీఐ కి చెందిన వర్గాలు తెలిపాయి.

## రెండు వేదికల్లో డబ్ల్యూపీఎల్ 2026 మ్యాచ్‌లు..

- **జనవరి 9న డబ్ల్యూపీఎల్ 2026 సీజన్ ప్రారంభం**
- **తొలి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఢీ**
- **నవీ ముంబై, వడోదర నగరాల్లో మ్యాచ్‌ల నిర్వహణ**
- **ఫిబ్రవరి 5న వడోదరలో ఫైనల్ పోరు**
- **తొలిసారిగా జనవరి-ఫిబ్రవరి నెలల్లో టోర్నీ**



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌కు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి ( శనివారం విడుదల చేసింది. ఈ మెగా టోర్నీ జనవరి 9న ప్రారంభం కానుండగా, తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్, 2024 విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. ఈ ఆరంభ మ్యాచ్‌కు నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం వేదిక కానుంది. ఈ సీజన్‌లోని మ్యాచ్‌లను రెండు నగరాల్లో నిర్వహించనున్నారు. తొలి దశలో భాగంగా జనవరి 9 నుంచి 17 వరకు నవీ ముంబైలో 11 మ్యాచ్‌లు జరుగుతాయి. అనంతరం టోర్నీ గుజరాత్‌లోని వడోదరకు షిఫ్ట్ అవుతుంది. ప్లేఆఫ్స్‌తో సహా మిగిలిన 11 మ్యాచ్‌లకు వడోదరలోని కోటంబి స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. ఫిబ్రవరి 5న ఫైనల్ మ్యాచ్‌ను కూడా ఇక్కడే నిర్వహిస్తారు.

లీగ్ దశ ఫిబ్రవరి 1న ముగియనుండగా, పాయింట్ల పట్టికలో రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఫిబ్రవరి 3న ఎలిమినేటర్ మ్యాచ్ జరుగుతుంది. టేబుల్ టాపర్‌గా నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. గత మూడు సీజన్లుగా ఫిబ్రవరి-మార్చి నెలల్లో జరిగిన ఈ టోర్నీ, అంతర్జాతీయ మ్యాచ్‌లతో క్లాష్ కాకుండా ఉండేందుకు ఈసారి జనవరి-ఫిబ్రవరి విండోలో నిర్వహిస్తున్నారు.

ఇటీవల ఢిల్లీలో జరిగిన మెగా వేలం తర్వాత జట్లు మరింత బలంగా మారాయని, ఈ సీజన్ మరింత ఆసక్తికరంగా సాగుతుందని బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా తెలిపారు. ఇప్పటివరకు జరిగిన సీజన్లలో ముంబై ఇండియన్స్ రెండుసార్లు, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఒకసారి టైటిల్ గెలుచుకోగా, ఢిల్లీ క్యాపిటల్స్ మూడుసార్లు రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

## రుక్మిణి ఖాతాలో మూడు పాన్ ఇండియాలు

మృణాల్ ఠాకూర్ యొక్క తాజా ఫ్యాషన్ ఎంపిక







అబ్బురపరిచే రెడ్ డ్రెస్‌లో సారా అలీ ఖాన్ స్టన్స్

ఇటీవలి కాలంలో రష్మిక మందన్న, కియరా అద్వాణీ, శ్రీలీల లాంటి పాపులర్ పేర్లు మాత్రమే వింటున్నాం. అలాంటి సమయంలో రేస్ లోకి దూసుకొచ్చింది రుక్మిణి వసంత్. ఈ బ్యూటీ కాంతార 2లో రాకుమారి పాత్రలో అద్భుత అభినయంతో ఆకట్టుకుంది. కాంతార 2 బాక్సాఫీస్ వద్ద దాదాపు 800కోట్లు వసూలు చేసింది.ఈ సినిమాతో పాటు, యష్‌తో %-%టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోనప్స్%-%, జూనియర్ ఎన్టీఆర్ తో మోస్ట్ అవైటెడ్ %చీ=%నీల్ ప్రాజెక్టులోను నటిస్తోంది. రుక్మిణి కెరీర్ ఇటీవల కొత్త దశలోకి ప్రవేశించింది. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించడం ఖాయమని, ఇద్దరు బిగ్గెస్ట్ పాన్ ఇండియన్ స్టార్లతో సినిమాలు తన రేంజును అమాంతం పెంచేస్తాయని కూడా అంచనా వేస్తున్నారు. రెండు క్రేజీ పాన్ ఇండియన్ సినిమాలు 1000 కోట్ల క్లబ్ లో చేరతాయని కూడా ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ రెండు సినిమాలతో పాటు మరో పెద్ద స్టార్ తో పాన్ ఇండియన్ సినిమాకి రుక్మిణి సంతకం చేయబోతోందన్న గుసగుస కూడా వినిపిస్తోంది.ఇక రుక్మిణి గురించి తెలుసుకోవాల్సిన చాలా విషయాలున్నాయి. ఈ భామ ఇకపై ఒకసారి ఒక విషయంపై మాత్రమే దృష్టి సారిస్తానని చెప్పింది. ఫోన్‌లు మన దృష్టిని చెదరగొట్టగలవు. కాబట్టి కొన్నిసార్లు నేను జర్నల్ లేదా స్కెచ్ చేసాను. పాత్ర నుండి భావోద్వేగపరంగా కొట్టుకుపోకుండా ఒక వస్తువుపై ఘాఢంగా దృష్టి పెట్టడానికి స్కెచింగ్ నాకు చాలా సహాయపడిందని రుక్మిణి తెలిపింది.రుక్మిణి నటనలోకి అడుగుపెట్టడానికి చాలా కాలం ముందు నుండి కథలను చాలా ప్రేమిస్తుంది. తన బాల్యం లోనే అమర్ చిత్ర కథ - టింకిల్ కామిక్స్ చదివిన రోజులను గుర్తు చేసుకుంది. స్వచ్ఛమైన హాస్యం కోసం, డెర్రీ గర్ల్స్ ఆమె ఎంపిక. తనకు %-%ఓం శాంతి ఓం%-% ఇష్టమైన చిత్రం అని కూడా చెప్పింది. ఇది పరిశ్రమను ప్రేమ సహా ఎప్పుడూ ద్వేషం నుంచి బయటపడేలా చేస్తుంది. నేను దానిని చూసిన ప్రతిసారీ కొత్తదాన్ని కనుగొంటాను అని రుక్మిణి చెప్పింది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965